సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
గురువారం, 23.07.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 262
పేజీలు: 08 వెల: రూ. 5

## గాంధీ కుటుంబానికి
# త్యాగాలు కొత్తకాదు..
### రాహుల్, ప్రియాంక అరెస్టను ఖండించిన సీఎం రేవంత్

- రాహుల్ అరెస్ట్‌పై ఫైర్..
- బీజేపీ, బీఆర్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు
- ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి
- యువత కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది
- కొడంగల్‌లో బీజేపీ-బీఆర్ఎస్ కుమ్మక్కై తనపై కుట్ర 03



ఢిల్లీలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర విపక్ష నాయకుల అరెస్టుకు నిరసనగా తెలంగాణవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు హోరెత్తాయి. ఏఐసీసీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో 'చలో లోక్‌భవన్' భారీ ర్యాలీ నిర్వహించగా.. నెక్లెస్ రోడ్ నుంచి లోక్‌భవన్‌కు చేరుకున్న మంత్రులు, సీనియర్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు హనుమకొండలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన చేపట్టారు.

-ముద్ర, హైదరాబాద్ :

## లోకేష్‌కు చంద్రబాబు
# బాధ్యతలు!
### తెలంగాణలో టీడీపీ బలోపేతం వైపు అడుగులు



- టీడీపీ యాక్టివ్‌కు చంద్రబాబు ప్లాన్!
- తెలంగాణపై లోకేష్ ఫోకస్!
- టీడీపీ బలోపేతానికి కీలక అడుగు!
- పొత్తుల లక్ష్యంతో టీడీపీ వ్యూహం!

03



# మోడీ
- మూడోసారి అధికారంలోనూ మొండి వైఖరి భారమవుతోందా?
- విమర్శలపై స్పందన లేకపోవడం బీజేపీకి ఇబ్బందిగా మారుతోందా?
- రైతు ఉద్యమం నుంచి నీట్ వరకు మోడీపై పెరిగిన ఒత్తిడి

# మొండితనం
### తన వారిపై చర్యల్లో మోడీ మౌనం విమర్శలకు తావిస్తోంది

- ప్రజా అసంతృప్తిని పెంచుతున్న నిర్ణయాలపై ప్రశ్నలు
- సంక్షోభాల నిర్వహణలో మోడీ తీరుపై రాజకీయ చర్చ
- తన వారిని కాపాడే ధోరణే బలహీనతగా మారిందా?
- హ్యాట్రిక్ విజయం తర్వాత కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్న మోడీ
- ప్రతి విమర్శను విస్మరించడం రాజకీయంగా నష్టమేనా?
- మోడీ మౌనం.. విపక్షాలకు ఆయుధంగా మారుతోందా?

**ముద్ర డెస్క్:** రెండు రోజుల తక్కువ 25 నెలలు. అర్థం కాలేదా? అదేనండి రెండేళ్ల ఒక నెల. కాస్త కన్ఫ్యూజింగ్‌గా ఉందా? సూటిగా చెప్పాలంటే ముచ్చటగా మూడోసారి భారత దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వంలో ప్రభుత్వాన్ని కొలువు తీర్చింది 2024 జూన్ 24. అంటే.. ఈ రోజుకు (జులై 22) రెండు రోజులు తక్కువగా 25 నెలలు. తిరుగులేని అధిక్యతతో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం కేంద్రంలో కొలువు తీరుతుందన్న అంచనాలకు భిన్నంగా.. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రావటం.. బీజేపీ సొంతంగా సాధిస్తుందని భావించిన లోకసభ సీట్లకు భిన్నంగా.. తొలిసారి మిత్రపక్షాల మీద ఆధారపడాల్సిన అరుదైన సందర్భం అప్పట్లో చోటు చేసుకుంది. సుదీర్ఘ కాలం తర్వాత భారత ప్రధానిగా హ్యాట్రిక్ సాధించిన బలమైన ప్రధానిగా నరేంద్ర మోడీ అవతరించారు. అయితే.. ఆయనకు హ్యాట్రిక్ హానర్ తో పాటు.. హెచ్చరికను సార్వత్రిక ఎన్నికల ఫలితాలతో మిగతా 02లో

## భోగాపురం ప్రారంభోత్సవానికి
# ఆహ్వానం
### ఎయిర్ పోర్టును ప్రారంభించాలని మోదీకి చంద్రబాబు వినతి 03
### మారనున్న ఉత్తరాంధ్ర రూపు రేఖలు



# కాంగ్రెస్ నేతల అరెస్ట్
### హైదరాబాద్‌లో చలో లోక్‌భవన్ ఉద్రిక్తత

- రాహుల్ అరెస్టుపై తెలంగాణలో నిరసనలు
- లోక్‌భవన్ వద్ద ఉద్రిక్తత.. నేతల అదుపులోకి
- హైదరాబాద్, హనుమకొండలో కాంగ్రెస్ ఆందోళన
- ఏఐసీసీ పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు

03



## ఇరాన్‌కు ట్రంప్
# అల్టిమేటం
### ఇప్పటిదాకా ట్రైలర్ మాత్రమే.. సినిమా ముందుంది



- పికాక్స్ పర్వతం కింద అణు కేంద్రాన్ని ధ్వంసం చేస్తాం
- ఇరాన్ వద్ద 1,000 పౌండ్ల శుద్ధి చేసిన యురేనియం ఉంది
- సైనిక చర్యకు సిద్ధమని అమెరికా ప్రకటన
- టెహ్రాన్ సహా పలు ప్రాంతాల్లో అమెరికా వైమానిక దాడులు
- ప్రతిగా ఖతార్, కువైట్, బహ్రెయిన్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు

03

# హైదరాబాద్‌లో ఉద్రిక్తత
### కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ఆందోళనలు 02

- కర్రలతో కొట్టుకున్న ఇరు పార్టీల కార్యకర్తలు
- బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి
- చెప్పులు, కర్రలతో కొట్టుకున్న నేతలు
- బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్రావు అరెస్ట్



## రూ.80 కోట్ల
# అక్రమాస్తులు
### రెడ్కో ఇంజినీర్ ఇంటిపై ఏసీబీ దాడులు

- 4 ఇళ్లలో సోదా.. భారీగా నగదు.. కిలో బంగారం..
- భారీ ఆస్తులు, కీలక పత్రాలు స్వాధీనం
- వాటి విలువ బహిరంగ మార్కెట్లో 5.80 కోట్లు!
- విదేశీ మద్యం బాటిళ్లు సైతం గుర్తింపు

02



## కరీంనగర్‌లో దొంగల
# హల్ చల్

- డబ్బుతో సహా ఇంట్లోని టూవీలర్ వరంగల్ కు
- అక్కడి నుంచి రైలెక్కి పరార్
- రైలెక్కి ఉత్తరాదికి పోయారా?
- కరీంనగర్ దోపిడీ కేసులో సీసీ ఫుటేజ్ ఆధారంగా ముమ్మర గాలింపు

06



## రైతులకు కేంద్రం
# గుడ్ న్యూస్
### బియ్యం కోటా భారీ పెంపు.! 02

- తెలంగాణకు బియ్యం సేకరణ కోటా పెంపు
- ప్రధాని మోదీకి కిషన్ రెడ్డి కృతజ్ఞతలు
- పెరిగిన కోటాను పూర్తిగా వినియోగించాలన్న సూచన
- కొనుగోళ్లు వేగవంతం కానున్నాయి



# కాంగ్రెస్‌కు షాక్!
### మోదీ మాస్టర్ స్ట్రోక్.. 03

- ఎన్డీఏకు ఎన్సీపీ మద్దతు?
- శరద్ పవార్ భేటీతో రాజకీయ వేడి
- ఢిల్లీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు
- కాంగ్రెస్ పట్టుబిగిస్తే.. మోదీ ఎత్తుగడ
- ఎంవీఏ కూటమిలో అంతర్గత రాజకీయ పరిణామాలపై చర్చ



## ఇదీ AI ముద్ర

అధికారంలో ఉండి కాంగ్రెస్ మంత్రులు, పీసీసీ చీఫ్‌లు నిరసన తెలిపి అరెస్ట్ అవ్వడం ఒక వింత.. దీనిపై అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు.






## పరగడుపున పచ్చి వెల్లుల్లి



రోజూ ఉదయాన్నే పరగడుపున 1-2 పచ్చి వెల్లుల్లి రెబ్బలను నమిలి తిని, గోరువెచ్చని నీరు తాగాలి. ఇది రక్తంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, ధమనుల్లో రక్తం గడ్డకట్టకుండా కాపాడుతుంది.

# మోడీ మొండితనం

(మొదటి పేజీ తరువాయి)

భారత ఓటర్లు ఇచ్చిన విషయాన్ని మర్చిపోకూడదు. ఆయనకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని ఇస్తూనే.. గత ఫలితాలకు భిన్నంగా తమకున్న అసంతృప్తిని స్పష్టంగా చెప్పేస్తూ.. పాలనలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. మొదటి రెండు ప్రభుత్వాల సమయంలో మోడీకి ఎదురైన సవాళ్లకు భిన్నంగా మూడో సారి ప్రభుత్వ హయాంలో ఎదురవుతున్నాయి. ఇక్కడ మరో అంశాన్ని ప్రస్తావించాలి. నిజానికి వరుసగా మూడు సార్లు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అరుదైన అవకాశం అందరికి రాదు. అలా వస్తే మరింత అప్రమత్తతతో వ్యవహరించాల్సి ఉంటుంది. వరుస ప్రభుత్వాలను ఏ ర్పాటు చేసే వారికి ఒక వెసులుబాటు ఉంటుంది. వారికంటూ ఒక టీం ఏర్పడడంతో పాటు.. తమదైన ఎజెండాతో ముందుకు సాగే వీలు ఉంటుంది. మధ్యలో వేరే ప్రభుత్వాలు ఏర్పాటై న తర్వాత మళ్లీ అధికారంలోకి వస్తే.. ప్రాధాన్యతలు మొదలు.. అధికార యంత్రాంగాన్ని దారికి తేవటానికి సమయం పడుతుంది.

అలాంటి తలనొప్పులు తగ్గుతాయి. అయితే.. ఏ పార్టీ అయినా బ్యాక్ టు బ్యాక్ రెండుసార్లు అధికారంలో ఉన్నప్పుడు.. ప్రభుత్వ వ్యతిరేకత సహజం. అందునా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు.. ప్రజల్లో కనిపించనట్లుగా ఉండే అసంత్రప్తికి.. విపక్షాలు సరైన అంశాల్ని తెర మీదకు తీసుకురావటం ద్వారా ప్రభుత్వం మీద ఒత్తిడిని ఇన్ స్టెంట్ గా పెంచే ముప్పు పొంచి ఉంటుంది. ఈ విషయాలన్నీ మోడీకి తెలియనివి కావు. గుజరాత్ సీఎం స్థాయి నుంచి ప్రధానిగా ఆయన ప్రయాణం అందరికి తెలిసిందే.

2001లో గుజరాత్ ముఖ్యమంత్రి కేశుభాయ్ పటేల్ అనారోగ్య కారణాలతో తప్పుకోవటం.. ఆయన స్థానంలో నరేంద్ర మోడీని ముఖ్యమంత్రిని చేశారు. స్వల్ప వ్యవధిలోనే ఆయన సీఎం హోదాలో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లిన ఆయన.. మొత్తంగా మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికల్ని ఎదుర్కొని పార్టీని విజయ తీరాలకు చేర్చారు. నాలుగుసార్లు నాన్ స్టాప్ గా గుజరాత్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఇక్కడే మరో ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాలి. నాలుసార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా వ్యవహరించిన ప్రధానమంత్రి పదవిని చేపట్టిన నరేంద్ర మోడీ.. తన సొంత రాష్ట్రాన్ని వీడినా.. ఆ రాష్ట్రంలో బీజేపీకి కంచుకోటగా నిలపటంలో సక్సెస్ అయ్యారు. ఇదంతా చూస్తే.. విజయాన్ని సాధించటం.. దాన్ని నిలుపుకోవటం.. కొనసాగించే విషయంలో మోడీ ట్రాక్ రికార్డు తిరుగులేని రీతిలో ఉంటుందని చెప్పాలి. కానీ.. ఆయనలోని కొన్ని లోపాలు.. వ్యక్తిత్వ తీరు కొత్త తలనొప్పులకు కారణమవుతున్నాయని చెప్పాలి. తన వారు ఎవరైనా సరే.. వారిపై వచ్చే విమర్శలు.. ఆరోపణల విషయంలో చర్యలు తీసుకోవటానికి మోడీ ససేమిరా అనేసేలా వ్యవహరిస్తుంటారు. నిజానికి సంఘ్ పరివార్ తీరు కూడా ఇలానే ఉంటుంది. ఏమైనా నాలుగు గోడల మధ్య విషయం ఉండాలే కానీ.. బయటకు వచ్చి రచ్చ అయిన తర్వాత ఆ విషయంలో వెనక్కి తగ్గే తత్త్వం ఉండదంటారు.

ఇందుకు నిదర్శనంగా 2021లో ఢిల్లీ శివారులో పంజాబ్ రైతులు చేపట్టిన రైతు ఉద్యమాన్నే తీసుకుంటే.. నెలల తరబడి సాగినా.. వెనక్కి తగ్గకపోవటమే కాదు మొండిగా వ్యవహరించారు. నిజానికి ప్రధానిగా మోడీ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన ఎదుర్కొన్న అత్యంత గడ్డు పరిస్థితి ఇదే. కొవిడ్ లో సమస్యలు ఎదుర్కొన్నా.. ఆయన ప్రభుత్వ నిర్ణయాల మీద ప్రజల్లో వ్యతిరేకత రాలేదు. అందుకు భిన్నంగా రైతు ఉద్యమంతో మోడీ ప్రభుత్వ ఇమేజ్ డ్యామేజ్ పరంపర ఒకటి తర్వాత ఒ కటి చొప్పున పెరుగుతూ పోతోంది. 2023లో భారత రెజ్లింగ్ ఫెడరేషన్ మాజీ అధ్యక్షుడు కం బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మీద మహిళా రెజ్లర్లు చేసిన లైంగిక వేధింపుల ఆరోపణ మోడీ ప్రభుత్వ ఇమేజ్ ను దెబ్బ తీసింది. ఈ సందర్భంలోనూ మోడీ అంతులేని మౌనాన్ని ప్రదర్శించారు. ప్రతి చిన్న అంశానికి వెంటనే స్పందించే తీరుతో మోడీ దేశ ప్రజల్ని విపరీతంగా ఆకట్టుకున్నారు. అంతకుముందు ప్రధానమంత్రులుగా పని చేసిన వారంతా జాతీయస్థాయి అంశాలపైనే స్పందించారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మొదట్లో మోడీ.. ఒక రాష్ట్రంలోని ఒక ప్రాంతంలో చోటు చేసుకున్న అంశంపై స్పందించటం.. ఆ అంశాల గురించి వివరాలు సేకరించాలని ఆదేశించటం..ఆరా తీయటం లాంటివి పెద్ద ఎత్తున వినిపించేవి. ఆయన ముందు పదేళ్లు ప్రధానమంత్రిగా వ్యవహరించిన మన్మోహన్ సింగ్ మౌన ప్రధానిగా చూసి.. చూసి విసిగిపోయిన దేశ ప్రజలకు మోడీ స్పందన అత్యద్భుతమన్నట్లుగా ఉండేది.



అయితే.. తన ఇమేజ్ ను పెంచే అంశాల మీద వేగంగా స్పందించే ఆయన.. ఏదైనా తీవ్రమైన ఆరోపణ.. సమస్యలపై నిరసన వ్యక్తం చేసే వారి విషయంలోనూ.. న్యాయం కోసం రోడ్డెక్కే వారి విషయంలో ఆయన తీరు భిన్నంగా ఉండేది. ఇది పెద్ద ఎత్తున విమర్శలకు తావిస్తున్న పరిస్థితి. బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఉదంతంలో ఒలింపిక్ విజేతలు సాక్షి మాలిక్.. బజరంగ్ పునియా.. వినేష్ ఫోగట్ లాంటి అంతర్జాతీయ ఖ్యాతి గడించిన మహిళా క్రీడాకారులు సైతం న్యాయం కోసం.. చర్యల కోసం నెలల తరబడి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పోరాటం చేయాల్సి రావటం.. మోడీ ఇమేజ్‌ను తీవ్రంగా ప్రభావితం చేసిందని చెప్పాలి. చివరకు తమ వంతుగా దేశానికి సాధించుకు తీసుకొచ్చిన పతకాల్ని మహిళా క్రీడాకారులు గంగా నదిలో పారేసేందుకు హరిద్వార్ కు వెళ్లటం.. వారు పెట్టుకున్న కన్నీరు దేశ ప్రజల్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. బాధితులు స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేసినా ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు ముందుకు రాలేదు. చివరకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్న తర్వాతే కేసు నమోదు చేయటం లాంటి అంశాలు మోడీ సర్కారు తీరుపై విమర్శలు గుప్పించేలా మారాయి.

సీఏఏ వ్యతిరేక ఆందోళనలు మోడీ సర్కారును ఇబ్బంది పెట్టినా.. దేశం మొత్తం కదిలే పరిస్థితి లేదు. దీనికి భిన్నంగా ఆపరేషన్ సింధూర్ ఎపిసోడ్ లో ప్రభుత్వానికి రావాల్సినంత ఇమేజ్ రాకపోగా.. కొత్త సందేహాలకు తెర తీసి.. మిశ్రమ చర్చకు తెర తీసింది. నిజానికి ఇదో పెద్ద ఎదురుదెబ్బగా పలువురు విశ్లేషించిన పరిస్థితి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. నీట్ పరీక్ష లీకేజీపై చర్యలు తీసుకోవాలని.. అందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మంద్రే ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలన్న డిమాండ్ చూస్తుండగానే చిలికి చిలికి గాలివానలా మారింది. ఈ ఉదంతంపై పోరు సుదీర్ఘంగా సాగటమే కాదు.. నీట్ పరీక్ష మరోసారి నిర్వహించి.. ఫలితాలు వెల్లడించిన తర్వాత కూడా పూర్వపు పరీక్ష లీకేజీ మీద దేశ రాజధానిలో జరుగుతున్న రగడ.. దానికి యువత పెద్ద ఎత్తున రోడ్ల మీదకు రావటం చూసినప్పుడు.. దీనంతటికి మోడీ కారణమన్న భావన కలుగక మానదు. తన జట్టులోని వారిపై వచ్చే ఆరోపణలు.. విమర్శలకు స్పందించటం.. వారిపై కఠిన చర్యలు తీసుకునే దిశగా అడుగులు పడని తీరు.. మోడీ సర్కారుకు ఒక బలహీనతగా మారిందని చెప్పాలి. చివరకు ఆయన తన పదవికి రాజీనామా చేయాలని విపక్ష కాంగ్రెస్ గొంతు సవరించుకునే వరకు వెళ్లింది. సుదీర్ఘ మౌనాన్ని విడిచి.. నీట్ పేపర్ లీక్ మహాపాపం అంటూ ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోడీ వ్యాఖ్యానించటం చూస్తే.. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందమన్న సామెత గుర్తుకు రాక మానదు. నిజానికి.. ఇదే మాట ముందే చెప్పేసి.. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని ఏకరువు పెట్టి ఉంటే.. ఈ రోజున కాక్రోచ్ పార్టీకి కానీ.. విపక్షాలకు కానీ నిరసనలకు అవకాశమే ఉండేది కాదు. తన ప్రభుత్వంపై పోరాటానికి ఎజెండా సిద్ధం చేసుకునే అవకాశం మోడీ తన మొండితనం.. తన వారిపై ఈగ వాలొద్దన్నట్లుగా వ్యవహరించటంతో పాటు.. ఎవరో ఏదో అడిగితే.. నా వాళ్ల మీద చర్యలు ఎందుకు తీసుకోవాలన్న తీరు.. చివరకు ఆయనకే ఎసరు పెట్టేలా మారటం గమనార్హం. అదే పనిగా చేస్తున్న తప్పులను మోడీ గుర్తించి సరి చేసుకుంటారా? లేదంటే.. తాను మినహా మరెవరూ లేరన్న భావన కలిగించే విషయంలో సక్సెస్ అయిన మోడీ.. అందుకు భిన్నంగా కాక్రోచ్ పార్టీ లాంటి సరికొత్త రాజకీయ పార్టీ స్థాపనకు తానే అవకాశం కల్పిస్తారా? అన్నది ప్రశ్న. అందుకు కాలమే సరైన సమాధానం చెబుతుంది.



## రైతులకు కేంద్రం గుడ్ న్యూస్

**ముద్ర డెస్క్:** తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం తీపి కబురు చెప్పింది. ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. తెలంగాణలో అదనంగా వడ్లను కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నులు (బియ్యం రూపంలో) పెంచేందుకు కేంద్రం అంగీకారం తెలిపింది. సవరించిన వరి కొనుగోలు అంచనాను బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులు గా కేంద్రం నిర్ణయించింది. దీంతో రైతులకు పెద్ద ఊరట లభించనుంది. తెలంగాణకు కేంద్రం బిగ్ రిలీఫ్ ఇచ్చే సమాచారం అందించింది. రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా వడ్ల కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం సవరించిన వరి కొనుగోలు అంచనాను బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులు గా నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా తెలంగాణలో రైతులు పండించిన ధాన్యానికి మరింత మార్కెట్ భరోసా లభించనుంది. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని స్వాగతించింది. ఇదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా వాహనాల స్థాన నిర్ధారణ వ్యవస్థ అమలుపై కూడా కేంద్రం కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని అన్ని అర్హత గల వాహనాల్లో వీఎల్టీఎస్ వ్యవస్థను పూర్తిగా అమలు చేయాలని కేంద్రం స్పష్టం చేసింది.

**రైతులకు ఊరట**

ఈ వ్యవస్థ ద్వారా వాహనాల కదలికలను రియల్ టైమ్‌లో పర్యవేక్షించే అవకాశం ఉండటంతో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగుపడనున్నాయి. పార్లమెంట్ లో మంత్రి పీయూష్ గోయల్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కలిశారు. తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వడ్ల కొనుగోలు అంచనాను పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధరతో కొనుగోలు జరిగేలా కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వ్యవసాయ రంగానికి ఊతమివ్వనుంది. అదనపు కొనుగోళ్లతో రైతులకు ఆర్థిక భరోసా పెరగడంతో పాటు రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత పక్కాగా కొనసాగేందుకు సహకరిస్తుందని బీజేపీ నేతలు చెబుతున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నందుకు కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.

## హైదరాబాద్ లో ఉద్రిక్తత

**ముద్ర, హైదరాబాద్:** కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో హైదరాబాద్ నడిఒడ్డున ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నీట్ పే పర్ లీక్, రాహుల్ గాంధీని బలవంతంగా అదుపులోకి తీసుకోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో లోక్ భవన్ ముట్టడికి మహేశ్ కుమార్ గౌడ్ పిలుపు నిచ్చారు. మరోవైపు ప్రధాని మోడీ ఇంటి ఎదుట ధర్నా చేసి ప్రజాస్వామ్యాన్ని కూనీ చేశారంటూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు, ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో బీజేపీ నేతలు పోలీసుల చర్యలను వ్యతిరేకిస్తూ నిరసనకు దిగారు. నేతల అరెస్టుల సందర్భంగా పోలీసులకు, బీజేపీ కార్యకర్తలకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసు లు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యాలయం పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో భద్రతను పోలీసులు మరింత కట్టుదిట్టం చేశారు. బీజేపీ నాయకుల అరెస్టుపై పార్టీ శ్రేణు లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు బీజేపీ నాయలకును నాంపల్లి బీజేపీ ఆఫీస్ వద్దనే అడ్డుకోగా, కాంగ్రెస్ నాయకులను ఖైరతాబాద్ సర్కిల్ వద్ద అడ్డుకున్నారు.

ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీ ఆఫీస్‌ను ముట్టడించే ప్రయత్నం చేయగా బీజేపీ కార్యకర్తలు కర్రలతో దాడి చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు సైతం పోలీస్ వాహనాలపైకి ఎక్కి కర్రలు విసురుతూ దాడికి పాల్పడ్డారు. ఈ క్ర మంలో బీజేపీ ఆఫీస్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇప్పటికే స్టేట్ కాంగ్రెస్ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కార్యకర్తలు ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడుతుండటంతో అదుపుచేయడం సవాల్‌గా మారింది.



## రూ.80 కోట్ల అక్రమాస్తులు

**ముద్ర డెస్క్:** తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు టీజీఆర్ఈడీసీఓ(తెలంగాణ రెడ్కో) డివిజనల్ ఇంజినీర్ ముత్యం వెంకట రమణకు చెందిన నివాసాలు, కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో బుధవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. మాదాపూర్‌లోని వెంకటరమణ నివాసంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేష్, ఏసీబీ డీఎస్పీ మజీద్ అలీ ఖాన్ సోదాలు చేశారు.

విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడి కమిషన్ల రూపంలో భారీగా ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలు, ఆయనపై అందిన ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు దర్యాప్తు ప్రారంభించి సోదాలు చేపట్టారు. పాల్వంచలోని రాహుల్ గాంధీ నగర్‌లో ఉన్న బంధువుల ఇళ్లతో పాటు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు.



సోదాల్లో ఇప్పటివరకు నాలుగు ఇళ్లు, కిలోకు పైగా బంగారు ఆభరణాలు, నాలుగు వాహనాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వెంకటరమణ తన భార్య పేరిట 'ఎంఎస్ ప్రైడ్' సహా పలు సంస్థల్లో భారీగా పెట్టుబడులు పెట్టి, ఆమెను డైరెక్టర్ గా కొనసాగిస్తున్నట్లు ఏసీబీ గుర్తించింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇప్పటివరకు సుమారు రూ.15 కోట్ల విలువైన ఆస్తులు గుర్తించగా, బహిరంగ మార్కెట్ విలువ రూ.80 కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. సోదాల సందర్భంగా ఆయన నివాసంలో లభించిన విదేశీ మద్యం బాటిళ్లను ఎక్సైజ్ శాఖకు అప్పగించినట్లు తేలింది.

కాగా, వెంకటరమణ 2019లో కూడా ఏసీబీ ట్రాప్ కేసులో చిక్కుకున్న విషయం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం ఇతర ప్రాంతాల్లోనూ సోదాలు కొనసాగుతున్నాయని, మరిన్ని అక్రమాస్తులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ఏసీబీ అధికారులు తెలిపారు. సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తులకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## 7 వేల మెగావాట్ల ఎల్‌నినో షాక్‌ను తట్టుకున్న వ్యవస్థ

### దేశంలోనే తొలిసారిగా 'ఎల్ నినో ఆంబ్యులెన్స్', 1912 హెల్ప్‌లైన్‌కు కృత్రిమ మేధ

### అప్పుల రీస్ట్రక్చరింగ్‌తో డిస్కంలను నంబర్-1గా తీర్చిదిద్దే ప్రణాళికలు

### ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష

**ముద్ర, హైదరాబాద్ :** 'ఎల్ నినో' ప్రభావంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినా, 7 వేల మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ విజయవంతంగా ఎదుర్కొందని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణంగా వర్షాకాలంలో 11 వేల మెగావాట్లుగా ఉండే పీక్ డిమాండ్ ఈసారి 16,500 మెగావాట్లకు చేరగా, జలవిద్యుత్ ఉత్పత్తి 2 వేల మెగావాట్లు తగ్గినా రాష్ట్రంలో ఎక్కడా పవర్‌కట్ విధించలేదని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల మాత్రమే తాత్కాలిక అంతరాయాలు ఏర్పడతాయని స్పష్టం చేశారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో 'ఎలక్ట్రిసిటీ ఆంబ్యులెన్స్' సేవలను ప్రారంభించామని, 1912 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ఏఐ సాంకేతికతను అనుసంధానించి ఫిర్యాదుల పరిష్కారాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. అలాగే రుణాల రీస్ట్రక్చరింగ్ ద్వారా డిస్కంలను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం కోసం రూ. 1.20 కోట్ల బీమా, రైతులకు ఉచిత విద్యుత్ సబ్సిడీ, గృహజ్యోతి పథకం కింద 53 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.



## నీట్ వ్యవహారంపై బీజేపీని విమర్శించిన బీసీ జేఏసీ

### బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి

**ముద్ర, హైదరాబాద్:** నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. నీట్ లీకేజీ వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని, విద్యార్థుల ఆందోళనకు బీసీ జేఏసీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. విద్యార్థుల డిమాండ్లు నెరవేరే వరకు, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కుర్మా, బీసీ మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తారకేశ్వరి, బిసి యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు రావుల కోల్ నరేష్ ప్రజాపతి, బిసి యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి విజయ్ గౌడ్ పాల్గొన్నారు

## గుండెపోటుకు రాకుండా వెల్లుల్లి -తేనె మిశ్రమం



నలగ్గొట్టిన వెల్లుల్లి రెబ్బలను ఒక చెంచా స్వచ్ఛమైన తేనెతో కలిపి ప్రతిరోజూ తీసుకోవాలి. తేనె, వెల్లుల్లి కాంబినేషన్ రక్తపోటును అదుపులో ఉంచుతూ, గుండెకు రక్తప్రసరణను సులభతరం చేస్తుంది.



## కాంగ్రెస్ నేతల అరెస్ట్

**చలో చలో లోక్‌భవన్ ఉద్రిక్తం**

**రాహుల్ అరెస్టుపై నిరసనలు**

### హైదరాబాద్, హనుమకొండలో కాంగ్రెస్ ఆందోళన

**ముద్ర, హైదరాబాద్:** ఢిల్లీలో నిన్న ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో పాటు విపక్షనేతల అరెస్టుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో చలో లోక్‌భవన్ కార్యక్రమం చేపట్టారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ నుంచి లోక్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అజారుద్దీన్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ర్యాలీ లోక్‌భవన్‌కు చేరుకున్న వెంటనే మంత్రులు, కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఇక ఏఐసీసీ పిలుపు మేరకు హనుమకొండలో చేపట్టిన నిరసనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## ఇప్పటిదాకా ట్రైలరే

### సినిమా ముందుంది

### ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం



**పికాక్స్ పర్వతం కింద అణు కేంద్రాన్ని ధ్వంసం చేస్తాం**

**ఇరాన్ వద్ద 1,000 పౌండ్ల శుద్ధి చేసిన యురేనియం ఉంది**

**సైనిక చర్యకు సిద్ధమని అమెరికా ప్రకటన**

**టెహ్రాన్ సహా పలు ప్రాంతాల్లో వైమానిక దాడులు**

**ప్రతిగా ఖతార్, కువైట్, బహ్రెయిన్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు**

**ముద్ర డెస్క్:** అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకూ ప్రమాదకర స్థాయికి చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటివరకు జరిగిన దాడులు కేవలం "ట్రైలర్" మాత్రమేనని, అసలు "సినిమా" ఇంకా ముందుందని వ్యాఖ్యానిస్తూ ఇరాన్‌పై మరింత భారీ సైనిక చర్యలకు సంకేతాలిచ్చారు. ముఖ్యంగా నతాంజ్ అణు కేంద్రానికి సమీపంలోని పికాక్స్ పర్వతం కింద రహస్య భూగర్భ అణు కేంద్రంలో ఇరాన్ మళ్లీ అణు కార్యక్రమాలను ప్రారంభిస్తోందని తమ వద్ద స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని ట్రంప్ వెల్లడించారు. ఆ కేంద్రాన్ని పూర్తిగా ధ్వంసం చేసి, అణు కార్యక్రమాన్ని శాశ్వతంగా నిలిపివేస్తామని స్పష్టం చేశారు.

ఇరాన్ వద్ద ప్రస్తుతం దాదాపు 1,000 పౌండ్ల శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ యురేనియాన్ని ఉపయోగించి అణ్వాయుధాల తయారీకి ఇరాన్ సిద్ధమవుతోందని ఆరోపించారు. అందుకే అవసరమైతే త్వరలోనే మరో భారీ సైనిక ఆపరేషన్ చేపట్టి ఆ నిల్వలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. యుద్ధం ఇదే విధంగా కొనసాగితే ఇరాన్ తీవ్ర విధ్వంసాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా అన్నారు.

ఇక మరోవైపు అమెరికా సైన్యం ఇరాన్‌పై దాడులను మరింత ఉధృతం చేసింది. రాజధాని టెహ్రాన్‌తో పాటు పలు ప్రధాన నగరాల్లో భారీ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఆపరేషన్ కేంద్రాలు, డ్రోన్ నిల్వ కేంద్రాలు, సైనిక స్థావరాలతో పాటు కొన్ని పౌర ప్రాంతాలు కూడా దాడులకు గురైనట్లు సమాచారం. వ్యూహాత్మకంగా కీలకమైన చాబహార్ పోర్టుపై అమెరికా మరోసారి క్షిపణి దాడులు జరిపినట్లు అధికారులు తెలిపారు.

అమెరికా దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ కూడా తన దాడులను విస్తరించింది. ఖతార్, కువైట్, బహ్రెయిన్ లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తూ మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలను మరింత పెంచుతోంది. దీంతో ప్రాంతీయ యుద్ధం మరింత విస్తరించే ప్రమాదం ఉందని అంతర్జాతీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

ఈ పరిణామాల మధ్య అమెరికా–ఇరాన్ మధ్య శాంతి చర్చలకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇరాన్ మంత్రి మొమేనీ రావల్పిండిలో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌తో దాదాపు 50 నిమిషాలపాటు భేటీ అయ్యారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించే మార్గాలపై చర్చించిన అనంతరం ఇరాన్ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ కుమారుడు మొజ్తబా ఖమేనీ పంపిన రహస్య సందేశాన్ని మునీర్‌కు అందజేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలున్నాయి.

ఇదిలా ఉండగా, ఇరాన్‌పై కొనసాగుతున్న సైనిక చర్యలకు ఇప్పటివరకు దాదాపు 37.5 బిలియన్ డాలర్లు (సుమారు రూ.3.6 లక్షల కోట్లు) ఖర్చవుతుందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు. సెప్టెంబర్ 30 వరకు అయ్యే అంచనా వ్యయాలు కూడా ఇందులో భాగమేనని తెలిపారు. అదే సమయంలో పెంటగాన్‌కు అదనంగా 67 బిలియన్ డాలర్ల నిధులు కేటాయించాలని అమెరికా ప్రభుత్వం ప్రతిపాదించడం యుద్ధం మరింత కాలం కొనసాగే అవకాశాలకు బలం చేకూరుస్తోంది. ట్రంప్ తాజా హెచ్చరికలు, ఇరాన్ ప్రతిస్పందన, మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న ఉద్రిక్తతలతో ప్రపంచం మరోసారి ఆందోళనలో మునిగిపోయింది.

## మోదీ మాస్టర్ స్ట్రోక్

### కాంగ్రెస్‌కు షాక్!

**ఎన్డీఏకు ఎన్సీపీ మద్దతు?, శరద్ పవార్ భేటీతో రాజకీయ వేడి**

**ఢిల్లీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు, కాంగ్రెస్ పట్టుబిగిస్తే.. మోదీ ఎత్తుగడ**

**ఎంవీఏ కూటమిలో అంతర్గత రాజకీయ పరిణామాలపై చర్చ**

**ముద్ర డెస్క్:** ఢిల్లీ కేంద్రంగా రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ చేస్తూ కాక్రోచ్ పార్టీ మూడు రోజులుగా నిరసన కొనసాగిస్తోంది. వీరికి మద్దతుగా ప్రధాని నివాసం వద్ద రాహుల్, ప్రియాంక పార్టీ నేతలతో కలిసి మెరుపు ధర్నా నిర్వహించారు. అటు ఇదే అంశం పైన పార్లమెంట్ స్తంభించారు. కాంగ్రెస్ పట్టు బిగిస్తున్న వేళ.. ప్రధాని మోదీ మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారు. తాజా పరిణామంతో పార్లమెంట్ వేదికగా రాజకీయంగా మరింత ఆసక్తి కరంగా మారుతోంది. పార్లమెంట్ సమావేశాల వేళ ఢిల్లీ నిరసనలతో హోరెత్తుతోంది. కాక్రోచ్ పార్టీ.. కాంగ్రెస్ నేతలు వరుస నిరసనలు కొనసాగిస్తున్నారు. ప్రధాని మోదీ నివాసం వద్ద రాహుల్, ప్రియాంక చేసిన ధర్నా జాతీయ స్థాయిలో సంచలనంగా మారింది. ఆ తరువాత ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకొని.. అక్కడ నుంచి తరలించారు. దీంతో.. వీరికి మద్దతుగా కాంగ్రెస్ నిరసనలకు దిగింది. పార్లమెంట్ సమావేశాలను విపక్షాలు అడ్డుకున్నాయి. ప్రభుత్వం నీట్ పైన ప్రకటనకు సిద్దమైంది. ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించన తరువాతనే చర్చ చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఇదే సమయంలో పార్లమెంట్ వేదికగా ఇండి కూటమిలో కీలక పార్టీ.. కాంగ్రెస్ మిత్రపక్షం.. రాహుల్ సన్నిహిత నే శరద్ పవన్ తన కుమార్తెతో కలిసి ప్రధాని మోదీతో సమావేశం అయ్యారు.

**ఎన్డీఏ కు ఎన్సీపీ మద్దతు..?**



కొంత కాలంగా శరద్ పవార్ ఇండీ కూటమిని వీడి ఎన్డీఏలో చేరేందుకు సిద్దమయ్యారనే ప్రచారం సాగుతోంది. అందులో భాగంగా ఆయన కుమార్తె సుప్రియా సూలేకు కేంద్రంలో మంత్రి పదవి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. తాజాగా సుప్రియా సూలే.. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసిన తరువాత డీలిమిటేషన్ బిల్లు చూసిన తరువాత తమ మద్దతు పైన నిర్ణయం తీసుకుంటామని సానుకూల సంకేతాలు ఇచ్చారు. ఈ సారి సమావేశాల్లోనే మహిళా రిజర్వేషన్.. డీ లిమిటేషన్ బిల్లు ఆమోదింపచేసుకోవాలని బీజేపీ డిసైడ్ అయింది. దీంతో.. తన కార్యాలయానికి వచ్చిన శరద్ పవార్ కు మోదీ స్వయంగా స్వాగతం పలికారు. చేయి అందించి లోపలకు తోడ్కొని వెళ్లారు. ఇది కాంగ్రెస్ కు షాకింగ్ గా మారనుంది. అయితే, తాజా నీట్ వివాదం.. ఆందోళన పైన చర్యలు తీసుకోవాలని ప్రధానితో శరద్ పవార్ చర్చించారని ఎన్సీపీ నేతలు చెబుతున్నారు. శరద్ పవార్ – మోదీ భేటీ నిర్ణయాల పైన ఇప్పుడు రాజకీయంగా ఉత్కంఠ పెంచుతున్నాయి.

## గాంధీ కుటుంబానికి త్యాగాలు కొత్తకాదు

### రాహుల్, ప్రియాంక అరెస్ట్‌ను ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి

**ముద్ర, హైదరాబాద్:** దేశం కోసం రక్తం చిందించడం, పదవులను త్యాగం చేయడం గాంధీ కుటుంబానికి కొత్తేమీ కాదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడిని ఖండించారు. నీట్ పేపర్ లీకేజీతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే పేపర్ల అమ్మకాలు సాగుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.

కొడంగల్‌లో నిరసనకు నేతృత్వం వహించిన రేవంత్ రెడ్డి

ఢిల్లీలో మంగళవారం నాడు కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును నిరసిస్తూ తెలంగాణ వ్యాప్తంగా పార్టీ నేతలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తన సొంత నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం వహించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వంలో ఏ ఎగ్జామ్ నిర్వహించినా పేపర్ లీకులు అవుతున్నాయని, దాంతో కోట్లాది విద్యార్థుల జీవితాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్ట్ బీజేపీ నియంతృత్వానికి నిదర్శనం అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపుతున్న వారిని అరెస్టు చేయడం దుర్మార్గం అన్నారు.

జంతర్ మంతర్ వేదికగా విద్యార్థులు పోరాడుతుంటే, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా విద్యార్థులపై పాశవిక దాడులు చేశారని మండిపడ్డారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచి, పార్లమెంటులో ధర్నా చేసిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలపై దాడులు చేసి అరెస్టు చేయడం దారుణమన్నారు. పేపర్ లీకేజీలపై జంతర్ మంతర్ వద్ద ప్రశ్నించిన విద్యార్థుల తలలు పగలగొట్టారని, బాధ్యుడైన ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపిన రాహుల్ గాంధీపై పోలీసులతో దాడి చేయించారని మండిపడ్డారు. యువత కోసం మోదీని గద్దె దించే వరకు కాంగ్రెస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. 2019 ఇంటర్ ఫలితాల గోల్‌మాల్‌కు కేటీఆర్ బినామీ సంస్థ 'గ్లోబరీనా'నే కారణమని, అది విద్యార్థుల ప్రాణాలను బలిగొందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఆ రోజే దానిపై చర్యలు తీసుకుంటే నీట్, సీబీఎస్ఈ పేపర్ లీకేజీలు జరిగేవి కావన్నారు. ఢిల్లీ బీజేపీ నేతలతో మాట్లాడి కేటీఆర్ ఆ సంస్థకు కాంట్రాక్టులు ఇప్పించారని విమర్శించారు.

రాహుల్ గాంధీని అరెస్ట్ చేస్తుంటే రక్తం కూడా వచ్చిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. యువత పక్షాన, విద్యార్థులకు అండగా నిలిచేందుకు శాంతియుతంగా నిరసన తెలిపినా కేంద్రం అడ్డుకుంటుందని విమర్శించారు. పేపర్ లీక్ బాధ్యులపై చర్యలు తీసుకోని కేంద్ర ప్రభుత్వం, బాధితులైన విద్యార్థులపై మాత్రం లాఠీఛార్జ్ చేయడం దారుణమన్నారు. కేంద్రం చేసిన తప్పిదాలను రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నారని, ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాడుతోందని దేశం మొత్తం గమనిస్తుందన్నారు. కానీ మోదీ ప్రభుత్వం మాత్రం యువత జీవితాలను గాలికొదిలేసి, కోట్ల రూపాయలు క్యాష్ చేసుకుందని మండిపడ్డారు. కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చి, నిరసనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**రాహుల్ అరెస్ట్‌పై రేవంత్ ఫైర్..**

**బీజేపీ, బీఆర్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు**

**ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి**

**యువత కోసం కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుంది..**

**కొడంగల్‌లో బీజేపీ-బీఆర్ఎస్ కుమ్మక్కై తనపై కుట్ర**



**నన్ను దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్ఎస్ చేతులు కలిపాయి: రేవంత్ రెడ్డి**

**కొడంగల్:** తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ, కేంద్రంలోని బీజేపీ తప్పిదాలను నిలదీస్తున్నందుకే ఆ రెండు పార్టీలు కలిసి తనపై కుట్రలు పన్నుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఆ పార్టీలు సిద్ధాంతపరంగా వేరైనా, కాంగ్రెస్‌ను దెబ్బతీయడమే వారి ప్రధాన లక్ష్యమని.. తన ఓటమి కోసం కలిసి పనిచేస్తున్నాయని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా సమగ్ర సవరణపై కొడంగల్‌లో బుధవారం ఉదయం బిఎల్‌ఏలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.

పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నామని, కొడంగల్‌లో నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేక కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ఓట్లను జాబితా నుంచి తొలగించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ యత్నిస్తున్నాయని ఆరోపించారు. ఓటు లేని వ్యక్తి చనిపోయిన శవంతో సమానమంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటు విలువ గుర్తించి రాష్ట్ర ప్రజలు ప్రతి ఒక్కరూ తమ ఓటును కాపాడుకోవాలని సూచించారు.

ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలో 78 శాతం ఓటర్ల నమోదు పూర్తయిందని, మిగిలిన 22 శాతం మంది నమోదును బిఎల్‌ఏలు సమగ్ర ఇంటింటి సర్వే (SIR) ద్వారా త్వరగా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఓటరు జాబితాలో పేరు లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును కాపాడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈ నెలాఖరు నాటికి 100 శాతం ఎస్ఐఆర్ పూర్తి చేసి, తనపై కుట్రలు చేసేవారికి తగిన బుద్ధి చెప్పాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

## 'భోగాపురం' ప్రారంభోత్సవానికి ఆహ్వానం

**ఎయిర్ పోర్టు ప్రారంభించాలని మోదీకి బాబు వినతి**

**మారనున్న ఉత్తరాంధ్ర రూపు రేఖలు**

**ముద్ర ఢిల్లీ:** ప్రధాని నరేంద్రమోదీతో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. పార్లమెంట్ హౌస్‌లో ప్రధానితో ఆయన సమావేశమయ్యారు. ఆగస్ట్ 1న జరిగే భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవానికి మోదీని చంద్రబాబు ఆహ్వానించారు. ప్రారంభోత్సవానికి వస్తానని ప్రధాని తెలిపారు. ప్రధానిని కలిసిన వారిలో కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రధానిని ఆహ్వానిస్తూ.. స్థానిక ఎంపీ అని కలిశెట్టిని చంద్రబాబు ఆయనకు పరిచయం చేశారు. అప్పలనాయుడు తనకు తెలుసని.. ఆయన రోజూ సైకిల్‌పై పార్లమెంట్‌కు వస్తున్నారని ప్రధాని అన్నారు. సుమారు అరగంట పాటు ఈ సమావేశం కొనసాగింది. రాజకీయ పరిస్థితులపై బాబు, మోదీ మధ్య చర్చ జరిగింది.



## లోకేష్‌కు చంద్రబాబు కీలక బాధ్యతలు!

**టీడీపీ యాక్టివ్‌కు చంద్రబాబు ప్లాన్!**

**తెలంగాణపై లోకేష్ ఫోకస్!**

**ముద్ర డెస్క్:** తెలంగాణలో తెలుగుదేశం పార్టీపై చంద్రబాబు ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. అక్కడ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీని యాక్టివ్ చేసేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. వచ్చే ఎన్నికల నాటికి అక్కడ కూటమిలు రంగంలోకి దిగే అవకాశం ఉంది. ఎలాగైనా అధికారంలోకి రావాలని బిజెపి ప్రయత్నిస్తోంది. మరోవైపు భారత రాష్ట్ర సమితి సైతం గట్టి ప్రయత్నాలు చేస్తోంది. మరోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయాలన్న కసితో కాంగ్రెస్ ఉంది. ఈ తరుణంలో వేరువేరుగా పోటీ చేస్తే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోవడం ఖాయం. అందుకే అక్కడ కూటమిలు రంగంలోకి దిగే ఛాన్స్ కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీతో ఎంఐఎం, వామపక్షాలు జతకడితే.. బిజెపి, భారత రాష్ట్ర సమితి కూటమి కట్టే ఛాన్స్ ఉంది.. అందుకే టిడిపిని యాక్టివ్ చేసి పొత్తులో భాగంగా ఓట్లు, సీట్లు పొందాలన్నది చంద్రబాబు ఆలోచనగా తెలుస్తోంది.

**చెక్కు చెదరని అభిమానం..**

ప్రస్తుతానికి తెలంగాణకు పార్టీ అధ్యక్షుడు లేరు. ఒకరిద్దరు నేతలు యాక్టివ్ గా పని చేస్తున్నారు. పార్టీ కార్యక్రమాలు మాత్రం జరగడం లేదు. గ్రేటర్ తో పాటు ఖమ్మం, నల్గొండ లాంటి జిల్లాల్లో తెలుగుదేశం పార్టీకి అభిమానులు ఉన్నారు. ప్రజాదరణ కూడా ఎక్కువగా ఉంది. అందుకే పార్టీని యాక్టివ్ చేసి.. ఏదో ఒక కూటమిలో చేరి.. పొత్తులో భాగంగా పోటీ చేస్తే సీట్లు దక్కించుకునే అవకాశం ఉంది. తెలంగాణలో పార్టీ పూర్వవైభవం సాధించే స్థితికి రానుంది. అందుకే చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నియామకంతో పాటు మంత్రి లోకేష్ కు అక్కడ కీలక బాధ్యతలు కట్టబెట్టినట్లు తెలుస్తోంది.

**టీడీపీలోకి వచ్చేందుకు..**

గులాబీ పార్టీలో చాలా మంది నేతలు అసంతృప్తిగా ఉన్నారు. ఆ పార్టీలో ఉన్న 80 శాతం మంది పూర్వాశ్రమం తెలుగుదేశం. అందుకే తెలంగాణలో టిడిపిని యాక్టివ్ చేస్తే పార్టీలోకి వచ్చేందుకు చాలామంది సిద్ధంగా ఉన్నారు. హైదరాబాద్ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేశారు. మాజీ మంత్రి బాబు మోహన్ సైతం పార్టీలోకి వచ్చేందుకు సిద్ధపడ్డారు. ఖమ్మం నుంచి బలమైన నేతగా ఉన్న నామా నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు వంటి పెద్ద పెద్ద నేతలు వచ్చి చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. గ్రేటర్ హైదరాబాదులో సైతం చాలామంది నేతలు టిడిపి వైపు చూస్తున్నారు. అందుకే చంద్రబాబు ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి తెలంగాణపై వారంలో ఒకరోజు ఉండాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ కు సూచించినట్లు తెలుస్తోంది. ఒకరోజు సమయం కేటాయించడంతోపాటు పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై లోకేష్ దిశా నిర్దేశం చేస్తారని తెలుస్తోంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
గురువారం 23.07.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# అవసర్మే

ఎన్నికలు జరిగినప్పుడు పోలింగ్ తేదీకి సరిగ్గా ఒకటి.. రెండు రోజుల ముందు ప్రముఖ తెలుగు దినపత్రికలలో ఇట్లాంటి కొన్ని శీర్షికలు – వార్తలు సాధారణ పాఠకుల దృష్టిని ఆకర్షిస్తాయి.

'పల్లెబాట పట్టిన పట్నం ఓటరు!'

'హైదరాబాద్ నగరం ఖాళీ అవుతోంది. ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి సొంతూళ్లకు కదిలారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ సరిపోని పరిస్థితి నెలకొంది. పల్లెల్లో ఎన్నికల పండుగ వాతావరణం కనిపిస్తోంది.'

'టోల్ ప్లాజాల వద్ద దద్దరిల్లిన ట్రాఫిక్.. కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు!'

'.. ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల జాతర కొనసాగుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలోని పంతంగి టోల్ ప్లాజా, కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్ గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి ఫాస్ట్‌ట్యాగ్ ఉన్నప్పటికీ వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడంతో టోల్ సిబ్బంది అదనపు కౌంటర్లను తెరిచారు పోలీసులు ట్రాఫిక్ ను క్రమబద్ధీకరిస్తున్నారు.'

★ ★ ★ ★ ★ ★

ఎన్నికలు అయిపోయిన తెల్లవారి కూడా మరికొన్ని వార్తలు ఇట్లాగే సాధారణ పాఠకుల దృష్టిని ఆకర్షిస్తాయి.

హైదరాబాద్ జిల్లా మొత్తం 15 నియోజకవర్గాల్లో రాష్ట్రంలోనే అత్యల్పంగా సగటున 46.56% పోలింగ్ మాత్రమే నమోదైంది.

అత్యల్ప పోలింగ్ నియోజకవర్గం: యాకుత్ పురా – 36.69%

అత్యధిక పోలింగ్ నియోజకవర్గం: జనగామ – 83.34%

'నగర ఓటరు నైరాశ్యం.. పోలింగ్ బూత్‌లు ఖాళీ!'

★ ★ ★ ★ ★ ★

ఈ వార్తలన్నీ క్రోడీకరించి ఆలోచిస్తే.. గ్రామాల్లో ఎన్నికల రోజు ఒక పండుగ. అయితే, నగరాల్లో అది ఒక ప్రక్రియగా మిగిలిపోతున్నది. పల్లెల్లో 'ఓటు వేయాలి' అనే ఆరాటం, ఉత్సాహం, సామాజిక చైతన్యం కనిపిస్తుంటే.. "వెళ్లినా.. వెళ్లకపోయినా.. ఒకటే' అనే నిరాసక్తత నగరాల్లో కనిపిస్తోంది.

ఇట్లా ఎందుకు జరుగుతున్నది? పోలింగ్ శాతాన్ని ప్రభావితం చేస్తున్న కారణాలేంటి? ! సానుకూలంగా ఆలోచించే ఒక సగటు విశ్లేషకుణ్ణి మాత్రం ఆలోచింపచేస్తుంది.

★ ★ ★ ★ ★ ★

### ఈ వైరుధ్యానికి కారణాలేమిటి?

తెలంగాణ రాష్ట్ర జనాభాలో సుమారు నాలుగింట ఒక వంతు మంది హైదరాబాద్ మహానగర ప్రాంతంలోనే నివసిస్తున్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, ఐటీ రంగానికి, విద్యకు, వైద్య సేవలకు కేంద్రబిందువైన ఈ నగరంలోనే ప్రతి ఎన్నికలో పోలింగ్ శాతం తక్కువగా నమోదవడం ఆలోచించాల్సిన అంశం.

ఉద్యోగాలు, విద్య, వ్యాపారాల కోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన లక్షలాది మంది తమ ఓటును ఇప్పటికీ స్వగ్రామాల్లో వినియోగించుకోవటానికే ఇష్టపడుతున్నారు. రాజకీయ పార్టీలు ప్రకటించే పథకాలు గ్రామీణులని ఆకట్టుకునే విధంగా ఉండటం ఒక కారణమైతే.. సొంత ఊర్లతో తమ అనుబంధాన్ని కొనసాగించడం, కుల / కుటుంబ బలాబలాలని నిలబెట్టుకోవటం కారణాలు.

దీనికి తోడు, నగరాల్లో శాశ్వత నివాసం ఏర్పడినా, పోలింగ్ రోజును సెలవుగా భావించి ఇతర అవసరాలకు వినియోగించడం వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతున్నాయి.

★ ★ ★ ★ ★ ★

### సర్ – ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నేపథ్యం?

ప్రజలు తరచుగా వలసలు వెళ్ళటం వల్ల, ఓటర్లు ఒకటికంటే ఎక్కువ ప్రదేశాలలో నమోదు చేయించుకోవటం వల్ల, మరణించిన ఓటర్ల పేర్లను తొలగించకపోవడం వల్ల ప్రస్తుతం ఉన్న(2002) ఓటర్ల జాబితాలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ... చట్టం ప్రకారం ఓటర్ల జాబితాలో సవరణలకు పూర్తి అధికారం కలిగి ఉన్న భారత ఎన్నికల సంఘం, 2002 ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కి శ్రీకారం చుట్టుంది.

అర్హుడైన ఏ పౌరుడు కూడా ఓటర్ల జాబితా నుండి తప్పిపోకూడదని, ఏ అనర్హుడు కూడా ఇందులో చేర్చబడకూడదు అన్న ముఖ్య లక్ష్యంతో ఎన్నికల సంఘం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ సర్ ను ప్రకటించింది. మన తెలంగాణలో ఈ ప్రక్రియ 2026 జూన్ 25 న ప్రారంభమైంది. ఈ తరుణంలో ఈ ప్రక్రియకు సంబంధించిన అపోహలు, సందేహాలు ప్రజలలో కలగటం సహజం. అందుకే కొన్ని విషయాలు ఈ సందర్భంగా తెలుసుకోవటం అవసరం.

★ ★ ★ ★ ★ ★

### ఆధార్ తప్పని సరి ఇవ్వాలా?

ఆధార్ కార్డ్ తప్పనిసరిగా ఇవ్వాలి అనే నిబంధన లేదు. ఓటరు పేరు – ఫొటో ధృవీకరించుకోవడానికి వయస్సు– పుట్టిన తేదీ ఋజువు చేసుకోవడానికి నివాసం – చిరునామా నిర్ధారించుకోవడానికి ప్రభుత్వం వారు సూచిస్తున్న అధికారిక ధృవీకరణ పత్రాల లో ఏదైనా ఒకటి సమర్పించాల్సి ఉంటుంది. మరి ఆ జాబితా లో ఏవేవి ఉన్నాయి?

1. జనన ధృవీకరణ పత్రం 2. పాస్‌పోర్ట్
3. 10వ తరగతి / SSC / ఇతర విద్యార్హత సర్టిఫికెట్ 4. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన శాశ్వత నివాస ధృవీకరణ పత్రం
5. కుల ధృవీకరణ పత్రం
6. కుటుంబ రిజిస్టర్ (Family Register) ప్రతులు
7. ప్రభుత్వం కేటాయించిన భూమి లేదా ఇల్లు సంబంధిత పత్రాలు 8. ప్రభుత్వ శాఖ, బ్యాంకు, పోస్టాఫీస్ లేదా స్థానిక సంస్థ జారీ చేసిన గుర్తింపు కార్డు 9. ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు
10. పెన్షన్ పీపీవో
11. అటవీ హక్కుల ధృవీకరణ పత్రం (Forest Rights Certificate).. ఇవి కొన్ని మాత్రమే

వీటిల్లో వేటినైనా జతచేయవచ్చు.

ఇక్కడ ముఖ్యమైన మరో రెండు ఫారాల గురించి తెలుసుకోవాలి.

★ కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం 6 ని పూర్తి చేసి బి.ఎల్.ఓ కి సమర్పించాలి. అవసరమైన

★ ఒక ఓటరు రెండు చోట్ల ఓటు హక్కుని కలిగి ఉండడం చట్టరీత్యా నేరం. ఇది గమనించాల్సిన విషయం. ఇక ఉద్యోగాల నిమిత్తం వేరే ఊర్లలో నివశిస్తున్నా ... పెళ్ళిళ్లై పుట్టింట్లో ఉండకపోయినా

శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళినా, లేదా మరణించినా.. ఆ వివరాలని.. ఆయా కుటుంబ సభ్యులు ఫారం – 7 ని భర్తీ చేసి బీఎల్ఓకి సమర్పించాలి.

ఓట్ల తొలగింపు ఏకపక్షంగా జరుగుతుందా? ఓటరు తన ప్రమేయం లేకుండా ఓటు కోల్పోయే అవకాశం ఉన్నదా? అనేది ఎక్కువ మందిని వేధిస్తున్న ప్రశ్న

ఈ తొలగింపు – ఏకపక్షంగా జరగదు. తొలగింపుకు ముందు ఆ కుటుంబ సభ్యులకు నోటీసు ద్వారా – తెలియపరుస్తారు. జులై నెల 31వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాని పారదర్శకంగా ప్రచురిస్తారు.. ప్రదర్శిస్తారు ఓటర్ల – అభ్యంతరాలనీ / విజ్ఞప్తుల(అప్పీల్స్ )నీ స్వీకరిస్తారు. ఈ అన్నింటినీ పరిష్కరించిన తరువాతనే అంటే 2026 అక్టోబర్ 1 వ తేదీన తుది జాబితా వెలువడుతుంది.

కేంద్ర ఎన్నికల సంఘం పక్షాన ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారు.

★ ★ ★ ★ ★ ★

### సందేహాలు – సమాధానాలు

భారత దేశంలో ఇటువంటి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ జరగటం మొదటిసారి కాదు. అయితే.. 2002 తరువాత ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ఇప్పుడు చేపడుతున్నారు. ఇంత సుదీర్ఘ కాలం తరువాత జరుగుతున్న ఈ ప్రక్రియకు సంబంధించి పౌరులలో అనేక సందేహాలు కలగటం సహజం.

★ ఇటీవల జరిగిన అసెంబ్లీ – పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేశాం కదా మళ్ళీ జాబితాలో మన పేరు ఉన్నదో లేదో చూసుకోవలసిన అవసరం ఉన్నదా?

★ఆన్ లైన్ ద్వారా అప్లై చేసుకోవచ్చా? ఎన్యూమరేషన్ ఫారం తమకి అందక పోతే ఎట్లా?

★ ఎన్యూమరేషన్ ఫారం నింపడంలో పొరపాట్లు జరిగితే ఎట్లా?

2002 ఓటర్ల జాబితాలో తమ పేరు, తల్లి తండ్రుల – తాతల పేర్లు, ఉన్నాయో లేదో తెలుసు కోవడం ఎట్లా? ఒక వేళ లేక పోతే ఏం చేయాలి?

★ గతం లో ఉన్న చిరునామాలో మార్పు ఉన్నా.. ఫొటో మార్చుకోవాలన్నా.. బీఎల్ఓ వచ్చినప్పుడు తాము ఇంట్లో లేకపోయినా.. ఊరికి వెళ్ళినా ఏం చేయాలి?

ఇట్లా పౌరులలో తల ఎత్తే ఎన్నెన్నో అనుమానాలు నివృత్తి కోసం.... పౌరులకు అందచేసిన ఎన్యూమరేషన్ ఫారం పై బీఎల్ఓ నెంబరును ముద్రించారు.

ఈ ప్రక్రియకి అనుబంధంగా
voters.eci.gov.in website
ceotelangana.nic.in
1950 టోల్ ఫ్రీ నంబర్ కూడా ఇచ్చారు.




### పౌరుల కర్తవ్యం ఏమిటి?

బాధ్యతాయుతమైన ఓటర్లు కూడా ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియని తమ కర్తవ్యంగా – పవిత్ర కార్యం పవిత్ర కార్యంగా భావించి బాధ్యతాయుతమైన పౌరులమని నిరూపించుకోవాలి.



ఏవీ అనిల్ ప్రసాద్
వరంగల్
99892 92070

### తెలంగాణ రాష్ట్రం లో 'సర్' ప్రక్రియ

సర్ – స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరగటం ఇది తొలి సారి కాదు. గతం లో దాదాపు 13 పర్యాయాలు జరిగినై. మన తెలంగాణా రాష్ట్రం లో ఈ పాటికే ఇంటింటి సర్వేలో.. బీఎల్ఓలు గణన ఫారాలని ఇంటింటికీ అందజేయటం, పూర్తి చేసిన ఫారాలని తిరిగి బీఎల్ఓకి అం దించే ప్రక్రియ ముగింపు దశకు వస్తుంది.

1.10.2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన – నిండుతున్నభారతీయ పౌరులందరికీ ఓటర్ల జాబితా లో చేర్చటం ప్రధాన లక్ష్యం.

అయితే ... ఒకే వ్యక్తికి వేర్వేరు చోట్ల ఓట్లు ఉన్నా, మరణించిన వారి పేర్లు ... ఇంకా శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళిన వారి పేర్లను జాబితా నుండి తొలగించటం మరొక ఆశయంగా ఈ "సర్" ప్రక్రియ జరుగుతున్నది.

---

# పునాది వారిది భవనం మీది

కొందరు కొడుకులు, బిడ్డలు తల్లిదండ్రులను నిందిస్తారు. కొందరు కోడళ్ళు అత్తమామలను నిందిస్తారు. కొందరు నిరుద్యోగులు దేశాన్ని నిందిస్తారు. తల్లిదండ్రులు, అత్తమామలు, దేశం లేదా సమాజం మనకు ఒక ప్రారంభాన్ని ఇవ్వగలవు. ఎవరైనా సరే మన జీవితాన్ని పూర్తిగా నడపలేరు. వారు చేయగలిగింది చేస్తారు, వారు చేతనైంది చేస్తారు అంతే! జీవితాన్ని పూర్తిగా నిర్మించుకోవడం మన బాధ్యతనే అని మరువకూడదు. నిత్యం ఇతరులు మన జీవితాన్ని నిర్మించలేరు ఇది ముందు తెలుసుకోవాలి. తల్లిదండ్రులు ఏమిచ్చారని అడగడం కంటే, నేను ఏమి సాధించాను అని ఆలోచించడం గొప్పది.

మన సమాజంలో చాలామంది యువకులు, యువతులు తమ జీవితంలో ఎదురైన కష్టాలకు కారణాలను వెతుకుతూ ఉంటారు. కొందరు 'మా తల్లిదండ్రులు నన్ను బాగా చదివించి ఉంటే నేను ఈ రోజు గొప్ప స్థాయిలో ఉండేవాడిని' అంటారు. మరికొందరు 'మా నాన్న బాగా ఆస్తి సంపాదించి పెట్టి ఉంటే నేను ఈరోజు సుఖంగా జీవించేవాడిని' అని భావిస్తారు. కొన్నిసార్లు ఈ ఆలోచనలు అసంతృప్తికి దారితీస్తాయి. 'నాన్న నాకేమి ఇచ్చాడు?', 'అమ్మ నాకు ఏమి చేసింది?', 'ఈ దేశం నాకేమి ఇచ్చింది?' అనే ప్రశ్నలు కూడా వినిపిస్తాయి. కానీ ఈ ప్రశ్నలకు ముందు మనం ఒకసారి ఆగి ఆలోచించాలి.

తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ ఒకే పరిస్థితిలో ఉండరు. కొందరికి ధనం ఎక్కువగా ఉంటుంది, కొందరికి తక్కువగా ఉంటుంది. కొందరికి చదువు ఉంటుంది, కొందరికి ఉండదు. కొందరు అవకాశాల మధ్య పెరుగుతారు, కొందరు కష్టాల మధ్య జీవిస్తారు. అయినప్పటికీ ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు తాము చేయగలిగినంత మంచి చేయాలని ప్రయత్నిస్తారు. వారు మనకు జన్మనిస్తారు. చిన్నతనంలో కాపాడుతారు. ఆకలేస్తే అన్నం పెడతారు. అనారోగ్యం వస్తే చూసుకుంటారు. తమకు చేతనైనంత వరకు చదివిస్తారు. జీవితంలో నిలబడేంత వరకు తోడ్పడతారు. ఇది చిన్న విషయం కాదు.

అవును, కొన్నిసార్లు వారు మనం ఆశించినంత చేయలేకపోవచ్చు. కానీ వారు చేయలేకపోయింది ఎప్పుడూ నిర్లక్ష్యం వల్లనే అని చెప్పలేం. చాలాసార్లు అది పరిస్థితుల వల్ల, ఆర్థిక పరిమితుల వల్ల, అవకాశాల కొరత వల్ల జరుగుతుంది.

### మన బాధ్యత కూడా ఎంతో ముఖ్యం

ఒక వ్యక్తికి కొంత అవగాహన వచ్చిన తర్వాత అతని జీవితంలో అతనికీ బాధ్యత మొదలవుతుంది. చదువుకోవాలనే తపన ఉంటే ఎన్నో మార్గాలు ఉన్నాయి. గ్రంథాలయాలు ఉన్నాయి, ఉపకార వేతనాలు ఉన్నాయి, ఆన్‌లైన్‌లో విద్య ఉంది, స్వయంకృషి చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రపంచంలో ఎంతో మంది చాలా పేదరికం నుండి ప్రారంభించి ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. అలాగే ఆస్తి విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. తల్లిదండ్రులు పెద్దగా ఆస్తి ఇవ్వకపోయినా, ఒక వ్యక్తి తన కృషితో సంపాదించవచ్చు. కొత్త ఇల్లు కట్టుకోవచ్చు, వాహనం కొనవచ్చు, వ్యాపారం ప్రారంభించవచ్చు, తన కుటుంబానికి మంచి భవిష్యత్తు ఇవ్వవచ్చు. అత్తమామల విషయంలో కూడా కోడళ్ళకు ఇలాంటి ఆలోచన వస్తుంది. 'మా అత్తమామలు ఏమీ ఇవ్వలేదు' ఫలానా వారు బాగా సంపాదించి పెట్టారు, ఇల్లు కట్టించారు, ఎకరాల కొద్ది భూములు సంపాదించారు, ఆస్తి పాస్తులు సంపాదించారు,

ప్రతి తల్లిదండ్రులు వారి శక్తికి మించి తమ పిల్లలను తీర్చిదిద్దారని చూస్తారు కానీ అది కుదరకపోవచ్చు, అంత మాత్రాన వారు చెడ్డ తల్లిదండ్రులు కారు కొందరి తల్లిదండ్రులకు తెలివితేటలు ఉంటాయి. కొందరికి తల్లిదండ్రుల కంటే పిల్లలకే ఎక్కువ తెలివితేటలు ఉంటాయి. పిల్లలు కూడా కుటుంబాన్ని తీర్చిదిద్దవచ్చు తెలివైన పిల్లలు. ఇక ఇతరులు ఎవరైనా సరే ఇతరులు వారి జీవితాన్ని వారు చక్కబెట్టుకోవాలని చూస్తారు. వారిని వదిలేసుకుని మిమ్మల్ని చక్కదిద్దాలని చూడరు. ముందు ఎవరైనా సరే వారిని చక్కదిద్దుకుంటారు. తర్వాత ఇతరులకు సహాయం చేయాలని చూస్తారు.

జీవితంలో ఎప్పుడూ ఇతరులు ఏమి ఇవ్వలేదో లెక్కపెట్టడం కంటే, మనకు ఉన్న అవకాశాలను ఉపయోగించుకోవడం మంచిది. ఎందుకంటే ఫిర్యాదు మన జీవితాన్ని మార్చదు. కానీ కృషి మాత్రం మారుస్తుంది. ఇది తల్లిదండ్రుల బాధ్యతలు లేవు అని చెప్పడం కాదు. పిల్లలను ప్రేమగా పెంచడం, మంచి విలువలు నేర్పడం, సాధ్యమైనంత వరకు విద్య అందించడం వారి బాధ్యతే. అలాగే పిల్లలకూ ఒక బాధ్యత ఉంది. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించడం, కృతజ్ఞతతో చూడడం, తమ జీవితాన్ని తాము నిర్మించుకోవడం. అదేవిధంగా దేశం కూడా ప్రతి పౌరుడికి అన్ని విషయాలు సిద్ధంగా ఇవ్వదు. దేశం అవకాశాలు, చట్టాలు, వ్యవస్థలు కల్పిస్తుంది. వాటిని ఉపయోగించి ఎదగడం పౌరుడి బాధ్యత కూడా అవుతుంది. 'దేశం నాకేమిచ్చింది?' అని అడగడం కంటే, 'నేను దేశానికి ఏమి చేశాను?' అని ప్రశ్నించగలిగితే సమాజం మరింత అభివృద్ధి చెందుతుంది. జీవితంలో ప్రతి ఒక్కరికీ కొన్ని లభిస్తాయి, కొన్ని లభించవు.

చివరగా, తల్లిదండ్రులు, అత్తమామలు, సమాజం, దేశం మనకు ఒక పునాది ఇవ్వగలవు. కానీ ఆ పునాదిపై భవనాన్ని నిర్మించేది మనమే. వారు చేయగలిగింది చేస్తారు; మిగిలినది మన కృషి, మన సంకల్పం, మన బాధ్యత. ఇతరులను నిందించడం కంటే, మన జీవితాన్ని మనమే తీర్చిదిద్దుకోవడం గొప్ప మార్గం.

ముగింపు



డాక్టర్ సుంకరి రాజారామ్
7799910222

---

## ఆషాఢంలో శుభకార్యాలు
# ఎందుకు చేయరు?



ప్రతి సంవత్సరం ఆషాఢ మాసం రాగానే.. 'ఆ నెలలో పెళ్లిళ్లు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు చేయకూడదు' అనే మాట ఎక్కువగా వినిపిస్తుంది. చాలా మంది ఈ మాసాన్ని అశుభంగా భావిస్తుంటారు. కానీ వేదాలు, పురాణాలు, ధర్మశాస్త్రాలను పరిశీలిస్తే ఆషాఢం అశుభ మాసం కాదని.. ఆధ్యాత్మిక సాధనకు అత్యంత పవిత్రమైన కాలం అని తెలుస్తుంది. ఈ నెలలో శుభకార్యాలను తగ్గించడం వెనుక మతపరమైన కారణాలతో పాటు ఆరోగ్య, పర్యావరణ, సామాజిక అంశాలు కూడా ఉన్నాయి. అవేంటో చూద్దాం..

### 'ఆషాఢం' అనే పేరు ఎలా వచ్చింది?

హిందూ చాంద్రమాన పంచాంగంలో నాలుగో నెల ఆషాఢం. ఈ మాసంలో పౌర్ణమి రోజున చంద్రుడు పూర్వాషాఢ లేదా ఉత్తరాషాఢ నక్షత్రాల సమీపంలో సంచరించడం వల్ల దీనికి 'ఆషాఢ మాసం' అనే పేరు వచ్చింది. భారతీయ కాలగణనలో ఇది వర్షాకాల ప్రారంభాన్ని సూచించే ముఖ్యమైన మాసంగా భావిస్తారు. ధర్మశాస్త్రాల ప్రకారం.. ఆషాఢం అశుభ మాసం కాదు. ఈ నెలలో దేవతారాధన, జపం, తపస్సు, దానం, వ్రతాలు, పూజలు చేయడం ఎంతో శ్రేష్ఠంగా భావిస్తారు. అయితే వివాహాలు, గృహప్రవేశాలు వంటి కొన్ని మంగళకార్యాలను సంప్రదాయంగా వాయిదా వేస్తారు. ఇది మాసం అశుభం కావడం వల్ల కాదు; చాతుర్మాస్య ఆరంభంతో అనుసంధానమైన ఆచారం.

### చాతుర్మాస్యం అంటే ఏమిటి?

ఆషాఢ శుక్ల ఏకాదశిని దేవశయని ఏకాదశి అని పిలుస్తారు. ఈ రోజు నుంచి కార్తీక శుక్ల ఏకాదశి వరకు సుమారు నాలుగు నెలల కాలాన్ని చాతుర్మాస్యం అంటారు. 'చతుర్' అంటే నాలుగు, 'మాస్యం' అంటే నెలలు. ఈ కాలాన్ని ఆధ్యాత్మిక నియమాలు పాటించే ప్రత్యేక సమయంగా భావిస్తారు.

### శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి వెళ్తారా?

పురాణాల ప్రకారం.. దేవశయని ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో ఆదిశేషుడిపై యోగనిద్రలోకి ప్రవేశిస్తారని విశ్వాసం. కార్తీక మాసంలోని ప్రబోధిని ఏకాదశి రోజున ఆయన యోగనిద్ర నుంచి మేల్కొంటారని చెబుతారు. ఈ నాలుగు నెలలను దేవతల విశ్రాంతి కాలంగా ప్రతీకాత్మకంగా భావిస్తారు. అందుకే ఈ సమయంలో వివాహాలు వంటి శుభకార్యాలను నిర్వహించకుండా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తారు.

### శుభకార్యాలు ఎందుకు వాయిదా?

ప్రాచీన కాలంలో ఆషాఢం నుంచి వర్షాలు విస్తారంగా కురిసేవి. రవాణా సౌకర్యాలు తక్కువగా ఉండటంతో బంధుమిత్రులు ప్రయాణించడం కష్టమయ్యేది. యజ్ఞాలు, వివాహాలు వంటి పెద్ద కార్యక్రమాలు నిర్వహించడం కూడా ఇబ్బందికరంగా ఉండేది. అందుకే ఈ కాలంలో శుభకార్యాలను తగ్గించి, వర్షాకాలం ముగిసిన తర్వాత నిర్వహించే సంప్రదాయం ఏర్పడింది.

### ఆరోగ్యపరమైన కారణాలు ఏమిటి?

వర్షాకాలంలో తేమ అధికంగా ఉండటం వల్ల జీర్ణశక్తి తగ్గుతుందని ఆయుర్వేదం పేర్కొంటుంది. నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు, వైరల్ ఇన్‌ఫెక్షన్లు, జీర్ణ సంబంధ సమస్యలు పెరిగే అవకాశం ఉంటుంది. అందుకే ఈ కాలంలో ఉపవాసాలు, సాత్వికాహారం, తక్కువ మసాలా ఆహారం, నియమిత జీవన శైలిని పాటించాలని శాస్త్రాలు సూచించాయి. ఇవి శరీరానికి విశ్రాంతిని ఇచ్చి ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడతాయి.

### పర్యావరణ పరిరక్షణతో సంబంధం

వర్షాకాలం అనేక జీవరాశులకు సంతానోత్పత్తి కాలం. చెట్లు, మొక్కలు కొత్తగా చిగురిస్తాయి. చిన్న జీవులు విస్తరిస్తాయి. ఈ సమయంలో అనవసర ప్రయాణాలు తగ్గించడం, ప్రకృతిని ఎక్కువగా కలవరపెట్టకపోవడం, అహింసను పాటించడం వంటి సూచనలు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడతాయి.

### చాతుర్మాస్యానికి ఉన్న ప్రాధాన్యం

చాతుర్మాస్య సమయంలో పూర్వం సంచార జీవనం సాగించే ఋషులు, సన్యాసులు ఒకే ప్రాంతంలో ఉండి ప్రజలకు ధర్మబోధ చేసేవారు. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెరిగేది. ప్రజలు సత్సంగాలు, పురాణ పారాయణాలు, భజనలు, సేవా కార్యక్రమాల్లో పాల్గొని సమాజంలో ఐక్యతను పెంపొందించుకునేవారు.

### పాటించాల్సిన నియమాలు

చాతుర్మాస్య సమయంలో భక్తులు నిత్యపూజ, విష్ణు నామస్మరణ, గీతా–భాగవత పారాయణం, ఉపవాసాలు, దానధర్మాలు చేయడం శ్రేయస్కరంగా భావిస్తారు. కొందరు కొన్ని ఆహార పదార్థాలను తాత్కాలికంగా మానేస్తారు. మరికొందరు చెడు అలవాట్లను విడిచిపెట్టి ఆత్మనిగ్రహాన్ని అలవర్చుకుంటారు. ఈ నియమాల ఉద్దేశం శరీరం, మనసు, ఆత్మ క్రమశిక్షణలో ఉంచడం.

ఆషాఢ మాసం భయపడాల్సిన కాలం కాదు.. మనసును మలుచుకునే కాలం. బాహ్య వేడుకల కంటే అంతరంగ శుద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని ఈ మాసం చెబుతుంది. ప్రకృతితో సామరస్యంగా జీవించడం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం, కుటుంబం–సమాజంతో సత్సంబంధాలను బలపరచుకోవడం కాలం వెనుక ఉన్న ప్రధాన సందేశం.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 23.07.2026
www.mudranews.in | @mudranews



## గుండెపోటు రాకుండా వెల్లుల్లి పాలు

క్రష్ చేసిన 3-4 వెల్లుల్లి రెబ్బలను పాలలో వేసి బాగా మరిగించి, రాత్రి పడుకునేముందు తాగాలి. ఇది కొలెస్ట్రాల్‌ను కరిగించడమే కాకుండా శరీరంలో వాపులు తగ్గించి గుండెను బలంగా ఉంచుతుంది.



# గంగారం చెరువు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలి

### - పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**ముద్ర, కూకట్ పల్లి:**

చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం చెరువు సుందరీకరణ, అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆధ్వర్యంలో డీసీ శ్రీనివాస్, హైడ్రా ఇన్‌స్పెక్టర్ యూనస్, ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లా డుతూ చెరువు అభివృద్ధి పనులకు పక్కా ప్రణాళికలు రూపొం దించి, ప్రతిపాదనలు సిద్ధం చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా యుజిడి మళ్లింపు పైప్‌లైన్, ఎస్టీపీ నిర్మాణం, చెరువు కట్ట బలోపేతం, అలుగు మరమ్మతులు, ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్ తదితర పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. గంగారం చెరువును అందమైన పర్యా టక, విహార కేంద్రంగా తీర్చిదిద్ది ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని చెరువులను సుందరీకరించి, కబ్జాలు మరియు కాలుష్యం నుంచి పూర్తిస్థాయిలో రక్షిస్తామని ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు.

**ఆల్విన్ కాలనీలో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం..**

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఫేజ్-1లో నిర్వహించిన 'వన్ డే-వన్ వార్డ్' కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి. సృజన, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, డీసీ చాముండేశ్వరి, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, సిఎంసి అధికారులు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కాలనీవాసులు ప్రస్తావించిన సమస్యలను ప్రథమ ప్రాధాన్యంతో పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న అభి వృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పీఏసీ చైర్మన్ అధికారులను ఆదేశించారు. రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యాల కల్పనతో పాటు పార్కుల అభివృద్ధి, ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, నాలాల విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని సంరక్షించాలని ప్రజలకు సూచించారు. అలాగే తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అన్ని కాలనీలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ఆరెకపూడి గాంధీ తెలిపారు.



## సిరిధాన్యాల ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తులపై
## 30 మందికి శిక్షణ

**ముద్ర, తాండూర్:**

తాండూర్ వ్యవసాయ పరిశోధనా కేంద్రంలోని అగ్‌హబ్ లైవ్‌లీహుడ్ బిజినెస్ ఇంక్యుబేటర్ ఆధ్వర్యంలో సిరిధాన్యాల ప్రాథమిక ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్‌పై రెండు రోజుల వ్యవస్థాపక అభివృద్ధి శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామీణ యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సహా మొత్తం 30 మంది ఈ శిక్షణలో పాల్గొన్నారు.

శిక్షణలో సిరిధాన్యాల పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలతో పాటు ధాన్యాల శుభ్రపరచడం, గ్రేడింగ్, పొట్టు తొలగింపు వంటి ప్రాథమిక ప్రాసెసింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే శాస్త్రవేత్త డా. ప్రదీప్ ఆధ్వర్యంలో జొన్న, రాగి బిస్కెట్లు, బెల్లంతో తయారు చేసే బిస్కెట్లు, జీలకర్ర జొన్న ఉప్పు బిస్కెట్లు వంటి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై ప్రాయోగిక శిక్షణ అందించారు. ఈ కార్యక్రమం ద్వారా సిరిధాన్యాల ఆధారిత పరిశ్రమల స్థాపనకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార నిర్వహణ నైపుణ్యాలను అందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. రెండో రోజు బ్రాండింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ వ్యూహాలు, డిజిటల్ కామర్స్, ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ ద్వారా మార్కెట్ అవకాశాలపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు.

## తాండూరు రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



**ముద్ర, తాండూర్:**

తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ తాండూరు డివిజన్ నూతన కార్యవర్గాన్ని 2026–2028 కాలానికి రాష్ట్ర, జిల్లా కమిటీలు అధికారికంగా ప్రకటించాయి. గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, యాజమాన్య ప్రతినిధులతో చర్చించి, మెజారిటీ సభ్యుల అభిప్రాయాల మేరకు కార్యవర్గాన్ని ఏకాభిప్రాయంతో ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర కమిటీ తెలిపింది.

నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షురాలిగా కీర్తి శర్మ, అధ్యక్షుడిగా ఎం.వి. ఎన్. మోహన్ కృష్ణ గౌడ్, ఉపాధ్యక్షుడిగా వహీద్, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, సంయుక్త కార్యదర్శిగా సునీత, కోశాధికారిగా ఎం. రమేష్ గౌడ్ ఎన్నికయ్యారు. సలహా కమిటీలో ఇందూర్ రాములు, సోహెల్ ఉమ్రి సభ్యులుగా ఉన్నారు.

తాండూరులో సంఘ ఐక్యతను బలోపేతం చేయడం, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల హక్కులు, ప్రయోజనాల కోసం కృషి చేయడమే నూతన కార్యవర్గ లక్ష్యమని రాష్ట్ర కమిటీ పేర్కొంది.

ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపిన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎన్. రెడ్డి, తాండూరు డివిజన్‌లోని అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు.

## ప్రైవేటు పాఠశాలలపై దౌర్జన్యాలకు పాల్పడితే చర్యలు తప్పవు

**ముద్ర మల్కాజ్గిరి :**

ప్రైవేట్ పాఠశాలల పై దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ట్రస్మా నాయకులు మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమెకు సంఘం ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేశారు. విద్యార్థి సంఘాల పేరుతో, కుల సంఘాల పేరుతో, ఆర్టిఐ యాక్టివిష్టుల పేరుతో పాఠశాల నిర్వాహకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు వాపోయారు. డబ్బు వసూలే ప్రధానంగా ఇలాంటివారు పాఠశాలల నిర్వహకులను ఇబ్బంది చేస్తున్న విషయాన్ని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. తాజాగా ఉప్పల్ ప్రాంతంలో కొందరిపై కేసులు నమోదు అయినట్లు కూడా ఆమెకు తెలిపారు.

వసూళ్ళకు పాల్పడుతున్న వారి పట్ల కఠిన చర్యలు తీసుకుంటామని మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ సుమతి తమకు స్పష్టమైన హామీని ఇచ్చారని వారు ఈ సందర్భంగా తెలిపారు. పాఠశాల నిర్వహకుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తున్న వారిని ఉపేక్షించవద్దని సూచించారు. ఎవరు డబ్బులు డిమాండ్ చేసిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ట్రస్మా సభ్యులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిరు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం, రథోత్సవం

### - తలసాని శ్రీనివాస్ యాదవ్



**ముద్ర, సనత్ నగర్:**

బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం, రథోత్సవం అందరి సహకారంతో అత్యంత వైభవంగా నిర్వహించినట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం ఆయన శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి అమ్మవారి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ, వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు పాల్గొనగా ఆలయ పరిసర ప్రాంత ప్రజలు, వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించామని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో మంచి వర్షాలు కురుస్తున్నయని, పంటలు సమృద్ధిగా పండి ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఆలయ ట్రస్టు చైర్మన్ సాయిబాబా గౌడ్, ఈవో వినోద్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు హన్మంత రావు, పార్టీ నాయకులు, ఆలయ ప్రతినిధులు పాల్గొన్నారు.



## సమస్యలపై మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు

**ముద్ర ప్రతినిధి, తాండూర్:**

వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తాండూర్ పట్టణ బిజెపి కౌన్సిలర్లు నాగారం మల్లేశం, అంతారం కిరణ్, శ్రీకాంత్ రెడ్డిలు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా రోడ్ల మరమ్మతులు బాగు చేయాలని చిన్నపాటి వర్షానికి వీధుల్లో గుంతల మయంగా ఉన్న రోడ్డు వల్ల చాలా చోట్ల డ్రైనేజీలా పైకప్పులు లేక ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్నందువల్ల వాటిపైన దృష్టి సారించాలని, అలాగే ఐరన్ పోల్స్ స్తంభాల వద్ద భద్రత ఏర్పాటు చేయాలని లేకుంటే షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉంటుందని మరియు వీధి కుక్కల బెడద నుండి కూడా ప్రజలకు రక్షణ కల్పించాలని మున్సిపల్ కమిషనర్ కు విన్నవించడం జరిగిందని వారు తెలిపారు.

# పైలట్ రోహిత్ రెడ్డికి హైకోర్టు ఊరట.. బెయిల్ షరతు సడలింపు

**తాండూర్, ముద్ర:**

తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు కీలక ఊరట కల్పించింది. ట్రయల్ కోర్టు ముందస్తు అనుమతి లేకుండా కోర్టు పరిధిని వీడరాదన్న బెయిల్ షరతును సడలిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మిగిలిన అన్ని బెయిల్ షరతులు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. పిటిషన్‌పై విచారణ సందర్భంగా దర్యాప్తులో కీలక భాగం ఇప్పటికే పూర్తైందని, తాను తాండూర్ నియోజకవర్గంలోనే నివసిస్తున్నానని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు పరిశీలించిన హైకోర్టు సంబంధిత షరతును సడలించింది.



ఈ పరిణామంతో పైలట్ రోహిత్ రెడ్డి త్వరలోనే నియోజకవర్గ పర్యటనలు చేపట్టే అవకాశం ఏర్పడింది. దీంతో ఆయన అనుచరులు, బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తుండగా, తాండూర్ నియోజకవర్గ రాజకీయాల్లో మళ్లీ చురుకుదనం నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## 'సర్' కార్యక్రమాన్ని వేగవంతం చేయండి

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ముద్ర, కాప్రా:**

ఉప్పల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ఆశించిన వేగంతో సాగడం లేదని, ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా ఇంటింటికీ తిరిగి అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సూచించారు. ప్రతి ఓటు ఎంతో కీలకమని, ఒక్క ఓటు కూడా వృథా కాకుండా ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి సరిచేసుకునేలా సహకరించాలని కోరారు.

పార్టీ నాయకులు, బూత్ స్థాయి ఇన్‌ఛార్జీలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఇంటింటికీ వెళ్లి ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## ఎన్నికల పనులు గడువులోగా పూర్తి చేయాలి

### జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్

**ముద్ర, శేరిలింగంపల్లి :**

శేరిలింగంపల్లి నియోజకవర్గ ఈఆర్వో, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ అధ్యక్షతన జోనల్ కార్యాలయంలో ఎన్నికల సంబంధిత పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఫీల్డ్ వెరిఫికేషన్‌లో ఎలాంటి లోపాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి బూత్ పరిధిలో హెల్ప్ డెస్క్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేసి పనులను పకడ్బందీగా పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు బాధ్యతాయుతంగా, నిబద్ధతతో విధులు నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 23.07.2026
www.mudranews.in | @mudranews



## గుండెపోటు రాకుండా వెల్లుల్లి టీ



తురిమిన వెల్లుల్లిని నీటిలో మరిగించి, కొద్దిగా నిమ్మరసం, తేనె కలిపి టీ లాగా తాగవచ్చు. ఈ టీ రక్తనాళాల గోడలను ఆరోగ్యంగా ఉంచి, హై బిపి రాకుండా నియంత్రిస్తుంది.

## మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం

– కలెక్టర్ చిత్రా మిశ్రా




**ముద్ర, కరీంనగర్** :జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరమని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామాల వారీగా నమోదైన కేసులను సమీక్షించి, నెలవారీతో పాటు వార్షిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ విద్యాసంస్థలు, దుకాణాల్లో నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఫిర్యాదులు అందిన వెంటనే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డీఈవో చైతన్య జైనీ పాఠశాలల్లో మాదకద్రవ్యాల నిరోధక క్లబ్బులు ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎక్సైజ్, మహిళా సంక్షేమ శాఖ అధికారులు కూడా తమ శాఖల ద్వారా అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులతో రైతులకు మేలు

ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**రసాయనిక ఎరువులు, పురుగుమందులకు బదులుగా సహజసిద్ధమైన ఎరువులతో సేంద్రియ వ్యవసాయం చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సేంద్రీయ రైతులతో ఆయన బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. సేంద్రీయ వ్యవసాయం వల్ల రైతుల ఆదాయం పెరగడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి సాధ్యపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి శ్రీ చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, నాయకులు రావుల రాంనాథ్ తదితరులు పాల్గొన్నారు

## నైపుణ్యాల పెంపుతో అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు

కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు పెంపొందించుకుంటే అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలు పెరుగుతాయని కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. ఐఐఐటి విద్యార్థులు విద్య పూర్తిచేసి బయటకు వెళ్లే నాటికే మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందేలా నైపుణ్యాభివృద్ధి ఆధారిత విద్యాబోధన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బాసర ఐఐఐటి క్యాంపస్‌ను బుధవారం సందర్శించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు ఏవైనా దృష్టికి వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. అధ్యాపకులు, ఉద్యోగులు, సిబ్బందికి కూడా మెరుగైన పని వాతావరణం, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఐఐఐటి ఉపకులపతి గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్, తహసీల్దార్ పవన్ చంద్ర, విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ కొయ్య బొమ్మలకు పునర్వైభవం కల్పిస్తాం

ఎం ఎల్ ఎ ఏలేటి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన నిర్మల్ కొయ్య బొమ్మలు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నేడు దయనీయ స్థితిలో ఉన్నాయని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కొయ్య బొమ్మల తయారీ కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. నిర్మల్ బొమ్మలకు మార్కెటింగ్ అవకాశాలను మరింత మెరుగుపరిచేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నుండి వారికి అన్ని రకాలుగా సహాయసహకారాలు అందేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు, నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్, నాయకులు రావుల రాంనాథ్, పట్టణ కౌన్సిలర్ లు నాయకులు పాల్గొన్నారు.

## నీట్ లీకేజీపై కోరుట్లలో కాంగ్రెస్ నిరసన



**ముద్ర, కోరుట్ల;** ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ కోరుట్ల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కొత్త బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించి, ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేత కృష్ణారావు మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు తోపాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి, కోరుట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ షాహిద్, మండల సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో కాంగ్రెస్–బీజేపీ ఉద్రిక్తత..

**- కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయం ముట్టడి యత్నంతో ఘర్షణ**



**ముద్ర, కరీంనగర్:** ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన నిరసనల నేపథ్యంలో కరీంనగర్‌లోనూ రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ పార్లమెంట్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు యత్నించడంతో బుధవారం ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పార్లమెంట్ కార్యాలయం వైపు దూసుకొచ్చిన కాంగ్రెస్ శ్రేణులను బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పార్లమెంట్ కార్యాలయం పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనపై బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ శ్రేణులు కాంగ్రెస్ నిరసనలను వ్యతిరేకిస్తూ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేశారు.

**గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు**

ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, దేశంలో ప్రజా విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధి కోసం అనవసర ఆందోళనలకు దిగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అశాంతి సృష్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. నీట్ పరీక్ష విషయంలో కేంద్ర ప్రభుత్వం రీ–ఎగ్జామ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించినప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం నిరసనలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కార్యాలయం వద్ద నిరసన పేరుతో అరాచక రాజకీయాలకు పాల్పడటం తగదని అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఎలాంటి బెదిరింపులకు భయపడరని, పార్టీపై దాడులకు ప్రయత్నిస్తే తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరించారు.

**కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కార్యాలయంపై దాడికి యత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు పోలీస్ కమిషనర్‌ను కోరారు. బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు తదితరులు కలిసి ఫిర్యాదు సమర్పించారు. ఫిర్యాదులో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు సుమారు 50 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్లమెంట్ కార్యాలయంలోకి బలవంతంగా ప్రవేశించేందుకు ప్రయత్నించారని, అక్కడ ఉన్న నాయకులను బెదిరించి దాడికి యత్నించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

**మేయర్, డిప్యూటీ మేయర్ స్పందన**

కాంగ్రెస్ అనవసర రాజకీయాలకు పాల్పడుతోందని నగర మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు ఆరోపించారు. బీజేపీని రాజకీయంగా ఎదుర్కొనే సామర్థ్యం లేక ఇటువంటి ఆందోళనలకు దిగుతోందని విమర్శించారు. బీజేపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని దాడులకు ప్రయత్నిస్తే సహించబోమని, అవసరమైతే దీటుగా బదులిస్తామని హెచ్చరించారు.

**పోలీసుల అప్రమత్తత**

ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు వెంటనే స్పందించి ఇరువర్గాలను నియంత్రించారు. పార్లమెంట్ కార్యాలయం పరిసరాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనపై అందిన ఫిర్యాదుల మేరకు పోలీసులు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

# కాంగ్రెస్ శ్రేణులపై దాడి

**బిజెపి నేతలను వెంటనే అరెస్టు చేయాలి..**
**కాంగ్రెస్ కు వస్తున్న ఆదరణ ను చూసి ఓర్వలేకనే దాడులు .**
**కరీంనగర్ లో బిజెపి అరాచకం పెరిగిపోతున్నది..**
**నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి..**
**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**
**బిజెపి కార్యాలయం వద్దకు వెలుతుండగా రాజేందర్ రావు పలువురు కాంగ్రెస్ నేతల అరెస్టు..**



**ముద్ర, కరీంనగర్** : నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు మాట్లాడుతూ, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి చేసిన బీజేపీ నేతలు, కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

బీజేపీ దాడుల్లో పలువురు కాంగ్రెస్ నాయకులు గాయపడ్డారని ఆరోపించిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వానికి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే ఈ దాడులు జరిగాయని విమర్శించారు. నీట్ పేపర్ లీక్ వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని, ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరసన అనంతరం బీజేపీ కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, వెలిచాల రాజేందర్ రావుతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గాయపడి చికిత్స పొందుతున్న కాంగ్రెస్ నాయకులను రాజేందర్ రావు పరామర్శించి, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం



**ముద్ర చిగురుమామిడి:** చిగురుమామిడి మండల కేంద్రం లోని గ్రామ 5వ వార్డు (దళితవాడ)లో సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం కావడం పట్ల భారతీయ జనతా పార్టీ దళిత మోర్చా హర్షం వ్యక్తం చేసింది. బీజేపీ దళిత మోర్చా చిగురుమామిడి మండల అధ్యక్షులు దొంత కర్ణకర్ మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిరంతరం పోరాటం చేశామని తెలిపారు.ఈ పనికి సహకరించి, సీసీ రోడు నిర్మాణం ప్రారంభమయ్యేలా కృషి చేసిన చిగురుమామిడి గ్రామ సర్పంచ్ శ్రీమతి ఆకవరం భవాని–శివప్రసాద్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## పెద్దపల్లిలో మోడీ దిష్టిబొమ్మ దహనం



**ముద్ర, పెద్దపల్లి:** నీట్ పరీక్షల పేపర్ లీక్ ఘటనతో పాటు కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టులను నిరసిస్తూ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు నేతృత్వంలో కమాన్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించి, ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మోడీ దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా విజయరమణరావు మాట్లాడుతూ, వరుస పేపర్ లీక్‌లతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. నీట్ లీక్ కారణంగా లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని, కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతిపక్ష నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టు అప్రజాస్వామిక చర్య అని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కరీంనగర్ దొంగలు..వరంగల్ పరార్

**రైలెక్కి ఉత్తరాదికి పోయారా?**
**కరీంనగర్ దోపిడీ కేసులో సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసుల ముమ్మర గాలింపు**



**ముద్ర, కరీంనగర్:** భగత్‌నగర్‌లో అజ్మత్ అలీ ఇంట్లో జరిగిన సంచలన దోపిడీ కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. దోపిడీ అనంతరం రెండు బైకులతో పరారైన నిందితులు వరంగల్ వైపు వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో గుర్తించారు. అనంతరం హుజురాబాద్ సమీపంలోని పెద్దపాపయ్యపల్లి వద్ద బైకులను వదిలేసి మరో వాహనంలో లేదా రైలులో ఉత్తరాదికి వెళ్లి ఉండొచ్చనే అనుమానాలతో ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి.దోపిడీకి ముందు నుంచే ఇంట్లో నగలు, నగదు ఎక్కడ ఉన్నాయో తెలిసినట్లు వ్యవహరించిన నిందితుల తీరుతో బాధితుడి అల్లుడిపై పోలీసుల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన వ్యక్తి కావడంతో, అక్కడి ముఠాను కరీంనగర్‌కు రప్పించి ఉండొచ్చనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. పెట్రోల్ బంక్, హైవే, రైల్వే స్టేషన్లలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్న పోలీసులు నిందితుల ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇటీవల పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ తర్వాత భద్రతను కట్టుదిట్టం చేసినప్పటికీ మరోసారి ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం నగరంలో చర్చనీయాంశంగా మారింది.

# రాత్రయితే భయం.... పోలీసు నిఘా శూన్యం

మరో మారు దొంగల భీభత్సం
పోలీసు శాఖపై విమర్శల వెల్లువ

**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**నిర్మల్ జిల్లాలో వరుస దొంగతనాలతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. రాత్రిళ్లు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నామని, పోలీసులు వాహనాల తనిఖీలు, జరిమానాలకే పరిమితమయ్యారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇటీవల పట్టణంలోని అపార్ట్‌మెంట్లు, దిలావర్‌పూర్‌లో చోరీలు మరువకముందే మంగళవారం అర్ధరాత్రి నిర్మల్ రూరల్ మండలం వెంకటాపూర్‌లో మూడు ఇళ్లలో తాళాలు పగులగొట్టి నగదు, విలువైన వస్తువులు దోచుకెళ్లారు.అదే రాత్రి వైష్ణవి అపార్ట్‌మెంట్‌లోకి చొరబడిన దొంగలను సమీపంలోని తన్వి అపార్ట్‌మెంట్ నైట్ వాచ్‌మన్ గమనించి అరవడంతో వారు పరారయ్యారు. ఎస్పీ కార్యాలయానికి సమీపంలోనే వరుస చోరీలు జరుగుతున్నా పెట్రోలింగ్ తగినంతగా లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చోరీ ఘటన అనంతరం కొద్ది రోజులే పెట్రోలింగ్ నిర్వహించి ఆ తర్వాత నిలిపివేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇన్ని దొంగతనాలు జరిగినా నిందితులను గుర్తించలేకపోవడం, సీసీ కెమెరాల పనితీరుపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజలకు భరోసా కల్పించేలా పోలీసులు





ముమ్మర పెట్రోలింగ్ చేపట్టి భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఇన్ని దొంగతనాలు జరుగుతున్నా ఒక్క దొంగతనం లో కూడా నిందితులను పట్టుకోలేదు. కాగా పట్టణంలో సి సి కెమెరాల పని తీరు కూడా ప్రశ్నార్థకంగా మారింది. జైలర్ ప్రకాష్ ను పరామర్శించేందుకు వచ్చిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎస్పీ తో మాట్లాడుతూ ఇదే విషయం పై ప్రశ్నించటం గమనార్హం.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 23.07.2026
www.mudranews.in | @mudranews



### గుండెపోటు రాకుండా వేయించిన వెల్లుల్లి



పచ్చి వెల్లుల్లి పడనివారు కొద్దిగా నెయ్యి లేదా ఆలివ్ ఆయిల్‌లో వెల్లుల్లి రెబ్బలను దోరగా వేయించి తినవచ్చు. ఇలా తీసుకోవడం వల్ల జీర్ణశక్తి పెరగడమే కాకుండా గుండె కండరాలకు బలం చేకూరుతుంది.

## గుట్టలో వర్ష పాశుపత వరుణ యాగము



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి అనుబంధ ఆలయమైన శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో వర్ష పాశుపత వరుణ యాగము ఆలయ పూజారులు నిర్వహించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నుంచి పాడి, పంటలకు కొరత లేకుండా పకృతి సస్యశ్యామలంగా తులతూగాలని ఆకాంక్షి ప్రారంభించడం జరిగిందని ఆలయ ఈవో భవాని శంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, వేద పండితులు ఆలయ అధికారుల పాల్గొన్నారు.

## దీన్ దయాల్ జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ జగన్ కు ఘన సన్మానం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి** : భువనగిరి తాసిల్దార్ జగన్ ని దీన్ దయాళ్ జీ ఫౌండేషన్ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్) పై ప్రజల అపోహలు ,అనుమానాలను తీర్చాలని, సార్ పారదర్శకంగా జరిగేలాగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దీన్ దయాల్ జీ ఫౌండేషన్ అధ్యక్షులు ఉడుత భాస్కర్, నల్లమాస వెంకటేశ్వర్లు, అల్లె భాస్కర్, ఎడబోయిన రాజేంద్రప్రసాద్, మేడి కోటేష్, యాట వెంకటేష్, కారుపాటి. రాజు, మేడబోయిన ప్రభాకర్, ఎరుపుల శివ, ఎదుగాని మంజునాథ్, గాయపాక పృథ్వీరాజ్, నరాల మహేష్, కొల్లా సుధాకర్ పాల్గొన్నారు.

## ధంసలాపురం ఆర్వోబీ పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల

**నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని ఆదేశం**

**ముద్ర ప్రతినిధి,ఖమ్మం, 22:** ఖమ్మం నగర శివారు ధంసలాపురం వద్ద నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను వ్యవసాయశాఖ మంత్రితుమ్మల నాగేశ్వర రావు బుధవారం పరిశీలించారు. పనుల పురోగతి, నిర్మాణ ప్రమాణాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆర్ ఓ బి పూర్తయితే ఖమ్మం నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు జాతీయ రహదారికి అనుసంధానం సులభమవుతుందని మంత్రి తెలిపారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్ అప్రజాస్వామికం

**యేకుల రాజారావు టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎస్సి విభాగం**



**కొండమల్లేపల్లి, జులై 22 (ముద్రన్యూస్):** ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీలతో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ ఇతర ముఖ్య నేతల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎస్సి విభాగం, బహుజన మేధావి డాక్టర్ యేకుల రాజారావు తీవ్రంగా ఖండించారు. న్యాయబద్ధంగా కేంద్రాన్ని ప్రశ్నిస్తున్న యువతకు వారి ఆకాంక్షలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బహుజన మేధావి డాక్టర్ యేకుల రాజారావు యువతకు విద్యార్థులకు భరోసానిచ్చారు.

## నీట్ పేపర్ లీక్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి

**ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ**




**కొండమల్లేపల్లి, జులై 22 (ముద్రన్యూస్):** నీట్ పేపర్ లీక్ చేసిన నిందితులను శిక్షించాలని ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై లాటి చార్జీని ఖండిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ క్లాక్ టవర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ దాదాపు 20 లక్షలపైగా దేశ వ్యాప్తంగా విద్యార్థులు నీట్ పరీక్ష రాస్తే ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పేపర్ లీక్ అయిందని విమర్శించారు. ప్రభుత్వానికి యంత్రాంగం ఉన్నప్పటికీ పేపర్ లీక్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గాదేపాక సూర్యతేజ, పట్టణ నాయకులు మహేష్, కిరణ్, శ్రీకాంత్, తరుణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరిలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం...

**కాంగ్రెస్ దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని బీజేపీ ఆగ్రహం**



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** దేశ వ్యతిరేక, సంఘ విద్రోహ శక్తులకు కాంగ్రెస్ పార్టీ వత్తాసు పలుకుతోందని ఆరోపిస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) భువనగిరి పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జగజ్జీవన్ రామ్ చౌరస్తా వద్ద రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. బీజేపీ భువనగిరి పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరామ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర నాయకులు పడమటి జగన్మోహన్ రెడ్డి, రచ్చ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు పట్నం శ్రీనివాస్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, కొప్పుల యాదిరెడ్డి, కదూరి అచ్చియ్య,పట్నం కపిల్, మాధురి చంద్ర, పక్కిరు రాజేందర్ రెడ్డి,జిల్లా కార్యదర్శి మేడికోటేష్, పంచద్దుల బలరాం, కోళ్ల బిక్షపతి, బందారు సుమలత, తుమ్మల యాస్మిన్ ,పట్టణ ఉపాధ్యక్షులు బెజ్జంకి రామకృష్ణా రెడ్డి, కొల్లోజు శ్రవణ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శులు రాళ్ళబండి కృష్ణాచారి, ఉడుత భాస్కర్, కొలుచెలిమ మల్లిఖార్జున్, సురేష్ రెడ్డి, ఆంజనేయులు, పృథ్వీ, రాజు,మంగు నర్సింహా రావు,ఆకుతోట రామ, సంతోష్, శివ, మహమ్మద్ భువనగిరి శ్యాంసుందర్, ప్రవీణ్, నాకు వినోద్, అనిల్, అశోక్, రాజు, మోర్చాల అధ్యక్షులు, వివిధ శక్తికేంద్ర ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులు మళ్లాలి: మంత్రి తుమ్మల

**- రాజీవ్ కాలువ ద్వారా గోదావరి జలాలను తిరిగి ఖమ్మం వైపు మళ్లించే వినూత్న ప్రయోగం**
**- వి.వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాలను పరిశీలించిన మంత్రి తుమ్మల**

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 22:** త్రాగునీటిని కాపాడుకుంటూ, రైతులు అధిక నీటి అవసరమున్న పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు మళ్లాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మంత్రి తుమ్మల, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కలిసి వి. వెంకటాయపాలెం డీప్‌కట్ వద్ద గోదావరి జలాల పరిస్థితిని పరిశీలించారు. అనంతరం అధికారులు, ఇంజినీర్లతో ప్రస్తుత నీటి లభ్యత, త్రాగునీటి సంరక్షణ, గోదావరి జలాలను ఖమ్మం వైపు మళ్లించే కార్యాచరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ప్రతి చుక్క నీటిని జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు సూచించిన విధంగా రైతులు ఆయిల్‌పామ్, చిరుధాన్యాలు, పప్పు ధాన్యాలు వంటి తక్కువ నీటిఅవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. ఏప్రిల్ 2026 నుంచే అధికారులు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు వరి సాగు చేపడితే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. ఖమ్మం జిల్లాకు కృష్ణా జలాలు మాత్రమే సరిపోవని, దశాబ్దాలుగా గోదావరి జలాలను తీసుకురావాలనే ప్రజల ఆకాంక్ష ఉందన్నారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో సీతారామ ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించి శ్రీరాముడి పేరుతో 'సీతారామ' ప్రాజెక్టుగా నామకరణం చేశామని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు జిల్లాకు అందుతున్నాయని చెప్పారు. ఇంజినీర్ల సూచనల మేరకు వైరాకు తరలించిన గోదావరి నీటిని రాజీవ్ కాలువ షట్టర్లు మూసివేసి తిరిగి ఖమ్మం వైపు మళ్లించే ప్రయోగం జరుగుతోందన్నారు. సుమారు రూ.90 కోట్లతో నిర్మించిన రాజీవ్ కాలువ వల్ల రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పరిస్థితి ఏర్పడిందని, ఇది సాగునీటి రంగంలో విశేష విజయమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సాంకేతిక సూచనలు అందించి విజయవంతంగా పూర్తి చేసిన ఇంజినీర్లను ప్రత్యేకంగా అభినందించారు. వీబీజీఆర్ఏఎం నిధులను వినియోగించి ఎన్ఎస్‌పీ కాలువల్లో పెరిగిన పొదలను తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు మంత్రి సూచించారు.




ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, సిఇ ఇరిగేషన్ శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, డిపిఓ రాంబాబు, వివి పాలెం గ్రామ సర్పంచ్ కాపా ఆదినారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



### ఖమ్మం కు గోదావరి జలాలు

ముద్ర ప్రతినిధి, ఖమ్మం 22 : ఖమ్మం నగరానికి ఖమ్మం పట్టణానికి తాగు నీటి అవసరాలు తీర్చేందుకు గోదావరి జలాలను వదిలి గోదారమ్మ నీళ్లకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని వివి పాలెం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు జిల్లా అధికారులు రాష్ట్ర జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## వృద్ధుల రక్షణకు ప్రత్యేక కమిటీలు: ఎస్పీ

ముద్ర,సూర్యాపేట: జిల్లాలో వృద్ధుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీనియర్ సిటిజన్ రక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఒంటరిగా నివసిస్తున్న వృద్ధుల వివరాలను సేకరించి, వారికి పోలీసుల ద్వారా నిరంతర సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.వృద్ధ తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ వారి వారసుల బాధ్యతేనని స్పష్టం చేసిన ఎస్పీ, నిర్లక్ష్యం లేదా వేధింపులకు పాల్పడితే సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వృద్ధులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా పోలీస్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.

## ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

**కొండమల్లేపల్లి, జులై 22 (ముద్రన్యూస్):** అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, కాంగ్రెస్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.సర్ (SIR) ప్రక్రియలో భాగంగా ప్రతి ఇంటిని సందర్శించి అర్హుల వివరాలను పరిశీలించాలని, ఒక్క అర్హుడి పేరు కూడా ఓటరు జాబితా నుంచి తప్పిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పేదలు, గిరిజనులు, మహిళలు, యువత, వృద్ధులకు ఓటు హక్కు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ప్రతి బూతులో 100 శాతం సర్ ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు, బీఎల్ఓలు, కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బాలు నాయక్ కోరారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ డాక్టర్ దూదిపాల వేణుధర్ రెడ్డి,
తహసిల్దార్ నరేందర్, మండల రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ డాకు నాయక్, సీనియర్ నాయకులు నాయిని మాధవరెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి ఉట్కూరి వేమన్ రెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య, కొర్ర రాంసింగ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ అరెస్టు, నీట్ లీక్‌పై ఖమ్మంలో కాంగ్రెస్ నిరసన

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నాయకుల అరెస్టును ఖండిస్తూ, నీట్ పేపర్ లీక్ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుంచి ర్యాలీగా బయలుదేరిన నాయకులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాహుల్ గాంధీ అరెస్టు అప్రజాస్వామిక చర్య అని విమర్శించారు. నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం దురదృష్టకరమని అన్నారు. నీట్ లీక్‌కు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, దేశ యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిందని ఆరోపించారు. రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు,శాసనమండలి



మాజీ సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, టి పి సి సి ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి,రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భానోత్ బాలాజీ నాయక్, రాష్ట్ర ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు వడ్డేబోయిన నరసింహారావు, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులిపాటి వెంకయ్య, రంగా జనార్ధన్,సహేల జావేద్, పి సి సి సభ్యులు పుచ్చకాయల వీరభద్రం, ఏ ఐ సి సి సేవాదళ్ కో ఆర్డినేటర్ చోటా బాబా,పి ఏ సి ఎస్ చైర్మన్ రావూరి సైదుబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

# నాలుగు గదుల్లో రెండు స్కూల్స్ ఎలా నడుపుతారు : పోతినేని

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 22 :** ఖమ్మం నగరంలోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితిపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ నాయకులతో కలిసి రజకవీధి, రమణగుట్ట ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించిన ఆయన, శిథిలావస్థలో ఉన్న రజకవీధి పాఠశాల కారణంగా 60 మంది విద్యార్థులు రెండు కిలోమీటర్ల దూరంలోని రమణగుట్ట పాఠశాలలో చదువుతున్నారని తెలిపారు.రజకవీధి పాఠశాల భవన నిర్మాణానికి వెంటనే నిధులు కేటాయించాలని, లేకపోతే డీఈఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రమణగుట్ట పాఠశాలలో కేవలం నాలుగు గదుల్లోనే 160 మంది విద్యార్థులు చదువుతున్నారని, అవసరమైన సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. శ్రీశ్రీ విగ్రహం నుంచి మున్నేరు వరకు హైస్కూల్ లేకపోవడంతో వెంటనే ప్రభుత్వ హైస్కూల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి తగిన నిధులు కేటాయించడం లేదని విమర్శించిన పోతినేని సుదర్శన్, ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు



చేస్తున్న నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకోవాలని, ఖమ్మంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్, నాయకులు యర్రా శ్రీనువాసురావు, మెరుగు సత్యనారాయణ, జబ్బర్, నందిపాటి మనోహర్, దొంగల తిరుపతిరావు, పి రమ్య, బోడపట్ల సుదర్శన్, నాగులు మీరా, ఉపేంద్ర , వజేనేపల్లి శ్రీనువాసురావు పాల్గొన్నారు

# భువనగిరిలో మంచినీటి సమస్యపై బీఆర్ఎస్ నిరసన

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పట్టణంలో నెలకొన్న మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత మూడు నాలుగు రోజులుగా పట్టణంలో తీవ్రమైన తాగునీటి కొరత ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలు ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు.మున్సిపల్ జనరల్ ఫండ్‌తో కొన్ని వార్డుల్లో మాత్రమే బోర్లు వేయగా, ప్రతిపక్ష కౌన్సిలర్లు కోరిన ఇతర వార్డులను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి పెరుగుతున్న నేపథ్యంలో అత్యవసర చర్యలు చేపట్టాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పెంట నరసింహ, ఆంజనేయులు, బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు చిన్న స్వాతి మహేష్, నాకోటి నగేష్, పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఏవి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు శాగంటి నరసింహ, పెంట నితీష్, పద్మ పాల్గొన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 23.07.2026
www.mudranews.in | @mudranews



### గుండెపోటు రాకుండా కూరలు, సలాడ్లలో వెల్లుల్లి

ప్రతిరోజు వండే కూరలు, సూప్‌లు లేదా పచ్చి సలాడ్లలో క్రష్ చేసిన వెల్లుల్లిని క్రమం తప్పకుండా చేర్చుకోవాలి. దీనివల్ల శరీరానికి నిరంతరం అల్లిసిన్ అనే పోషకం లభించి గుండె పోటు ముప్పును తగ్గిస్తుంది.



# మెదక్ ను జీరో యాక్సిడెంట్ జిల్లాగా తీర్చిదిద్దాలి

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**




ముద్ర ప్రతినిధి, మెదక్:

మెదక్ జిల్లాను జీరో యాక్సిడెంట్ జోన్‌గా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే, పోలీసు శాఖ అధికారులతో నిర్వహించిన రహదారి భద్రత సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్ల గుర్తింపు, సీసీ కెమెరాలు, లైటింగ్, బారికేడ్లు, రేడియం స్టిక్కర్లు, స్పీడ్ నియంత్రణ చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల పార్కింగ్, అక్రమ నిర్మాణాలు, ఫ్లెక్సీల ఏర్పాటుపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు.

అనంతరం మత్తు పదార్థాల నియంత్రణపై నిర్వహించిన సమీక్షలో ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో యాంటీ డ్రగ్ కమిటీలు, రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో గుట్కా, పొగాకు ఉత్పత్తుల విక్రయాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, వైద్య శాఖలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి మత్తు పదార్థాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో గణేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ సమీక్ష సమావేశంలో డీఎంహెచ్ఓ గణేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డీఎస్పీలు ప్రసన్నకుమార్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఆపరేషన్ ముస్కాన్‌లో 78 మంది బాలల రక్షణ

**- 50 కేసులు నమోదు: ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు**

ముద్ర ప్రతినిధి, మెదక్:

మెదక్ జిల్లాలో నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్'లో 78 మంది బాలలను రక్షించి, బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై 50 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని హోటళ్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, దుకాణాలు, వ్యాపార సముదాయాల్లో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి వెంటనే రక్షించాలని అధికారులను ఆదేశించారు. రక్షించిన చిన్నారులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) ముందు హాజరుపరిచి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం అప్పగించాలని సూచించారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జార్జ్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సతేంద్ర ప్రసాద్, విద్య, వైద్య శాఖల అధికారులు, ఎన్‌జీవో ప్రతినిధులు, ఆపరేషన్ ముస్కాన్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా చూడాలి



**- జిల్లా కలెక్టర్ హైమావతి**

ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :

చిన్నకోడూర్ మండలంలో పలు ప్రభుత్వ స్థలాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అనంతగిరి రిజర్వాయర్ అతి సమీపంలోని చిన్నకోడూర్ మండలం కిస్టాపూర్ గ్రామ శివారులోని ఇల్లంతకుంట వెళ్ళే రోడ్ వెంబడి గల 10 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలం చుట్టూ సర్వే నిర్వహించి హద్దులు వేసుకోవాలని, ఆక్రమణలకు గురి కాకుండా ఎల్లప్పుడు నిఘా పెట్టాలని తహసిల్దార్ సలీంను ఆదేశించారు.అనంతరం మండలంలోని అల్లీపూర్ శివారులోని అనంతగిరి రిజర్వాయర్ పక్కన గల నీటిపారుదల శాఖ వారి స్థలాన్ని పరిశీలించారు.

## స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో జీవశాస్త్ర ఉపాధ్యాయుల పర్యావరణ సందేశం



ముద్ర ప్రతినిధి, మెదక్:

మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జీవశాస్త్ర ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులను వినియోగిస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. భోజనం, టీ విరామ సమయంలో ప్లాస్టిక్ లేదా పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ కప్పులకు బదులుగా సొంతంగా తెచ్చుకున్న స్టీల్ పాత్రలను ఉపయోగించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. పెరుగుతున్న ప్లాస్టిక్ కాలుష్యం పర్యావరణంతో పాటు జీవరాశుల మనుగడకు ముప్పుగా మారుతోందని, ఈ నేపథ్యంలో తెలంగాణ జీవశాస్త్ర ఫోరం మెదక్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మార్పుకు శ్రీకారం చుట్టారని నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల శిక్షణ విజయవంతంగా ముగియగా, రిసోర్స్ పర్సన్లను బయోసైన్స్ ఫోరం, మండల బాధ్యులు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో బయోసైన్స్ ఫోరం మెదక్ జిల్లా అధ్యక్షుడు దొంతి ప్రసన్నకుమార్, ప్రధాన కార్యదర్శి మెరుగు నరేందర్, కోశాధికారి రమణ కుమార్, రిసోర్స్ పర్సన్లు ఇమ్మడి నాగరాజు, వెంకటరెడ్డి, అల్లం సతీష్ కుమార్ పాల్గొన్నారు.

## బీజేపీ నేతల అరెస్టు.. అడ్డుకున్న కార్యకర్తలు

ముద్ర, హైదరాబాద్ :

దిల్లీలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో పాటు విపక్షనేతల అరెస్టుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో చలో లోక్‌భవన్ కార్యక్రమం చేపట్టారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు నాంపల్లిలోని పార్టీ కార్యాలయం నుంచి గాంధీ భవన్ వరకు ర్యాలీగా బయలుదేరారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకుని అరెస్టు చేశారు.

రామచందర్‌రావుతోపాటు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని అరెస్టు చేసి వ్యాన్‌లో ఎక్కించగా.. బీజేపీ కార్యకర్తలు అడ్డుకున్నారు.

## రాహుల్ గాంధీపై దాడిని నిరసిస్తూ సిద్ధిపేటలో కాంగ్రెస్ ర్యాలీ







ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :

ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై జరిగినట్లు కాంగ్రెస్ పేర్కొంటున్న దాడిని నిరసిస్తూ సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్ నాయకత్వంలో విక్టరీ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు జరిగిన ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అత్తు ఇమామ్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులపై చర్యలు తీసుకోవడం అప్రజాస్వామికమని విమర్శించారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం దురదృష్టకరమని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, ఖలీముద్దీన్, దాస అంజయ్య, గంప మహేందర్, మార్కా సతీష్, రాజ్ బహదూర్ రెడ్డి, మీసం నాగరాజ్ ,ఎల్లా శ్రీనివాస్ రెడ్డి, షాబుద్దీన్, మెరుగు రాజు, సంతోషి, రైసుద్దీన్, వాహబ్ ,గయాస్, హర్షద్, దస్తగీర్, వంశీ,బొమ్మల ప్రవీణ్, ప్రభాకర్, విజయ్, ఆతిఫ్, సుధీర్, దేశెట్టి నరేష్, పవన్, రియాజ్, కర్ణాకర్, బిక్షపతి తదితరులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

నీట్ పేపర్ లేకేజికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ కోరుతూ సిద్దిపేటలో పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోకాళ్లపై రోడ్డుపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. యుఎస్ఎఫ్ఐ, విద్యార్థి నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

### రేపు విద్యా సంస్థల బంద్..

జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు చేసిన లాథిఛార్జ్ లకు నిరసనగా, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ ఈ నెల 24న సిద్దిపేట జిల్లాలో విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్టు విద్యార్థి నాయకుడు గుడికందుల రవి తెలిపారు.

## ప్రధాని, కేంద్ర విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మల దహనం



ముద్ర ప్రతినిధి, మెదక్:

ఢిల్లీలో లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మెదక్ జిల్లా కేంద్రం రాందాస్ చౌరస్తాలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. ప్రధాని, కేంద్ర విద్యా శాఖ మంత్రి దిష్టిబొమ్మలు దహనం చేయగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. మెదక్ జిల్లా డిసిసి అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ.. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం కల్పించిందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను వినాలే తప్ప, బలప్రయోగంతో నిరసనలను అణచివేయకూడదని సూచించారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, పార్లమెంట్‌లో విద్యార్థుల సమస్యలు, నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర చర్చ నిర్వహించాలని కోరారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్ తొడుపునూరి రామకృష్ణ, మాజీ సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు భూపతి రాజ్, పట్టణ అధ్యక్షులు గంగాధర్, చంద్రపాల్, బొజ్జ పవన్, భరత్ గౌడ్, మహేందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, సుభాష్ చంద్రబోస్, జిల్లా మైనార్టీ చైర్మన్ సూఫి తదితరులు పాల్గొన్నారు.

## 'పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి'



ముద్ర ప్రతినిధి, సిద్దిపేట :

స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎస్‌జీపీఏ) సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతినిధులు జిల్లా ట్రెజరీ అధికారిని కలిసి పెన్షనర్లకు సంబంధించిన పలు సమస్యలు, సందేహాలపై చర్చించారు. ఈ సందర్భంగా పెన్షనర్లకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు పెన్షనర్లు ఉన్నట్లయితే, వారిలో ఒకరి మూల వేతనం నుంచి మాత్రమే 1.5 శాతం హెల్త్ కేర్ ట్రస్టుకు జమ చేయబడుతుందని ట్రెజరీ అధికారులు తెలిపారు. అలాగే హెల్త్ కార్డులకు సంబంధించి గతంలో ఫోన్ నంబర్ మారినట్లయితే, ఆధార్ కార్డుకు లింక్ అయి ఉన్న ప్రస్తుత మొబైల్ నంబర్‌ను సంబంధిత పోర్టల్‌లో మార్పు చేసుకున్న అనంతరం హెల్త్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు స్పష్టం చేశారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందిస్తామని ట్రెజరీ అధికారులు తెలిపారు. పెన్షనర్లకు ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్‌జీపీఏ జిల్లా శాఖ ప్రతినిధులు తెలిపారు.

ఈ సమావేశంలో ఎస్‌జీపీఏ రాష్ట్ర కార్యదర్శి జోగు బిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి బోరెడ్డి మధుసూదన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు అన్నమరెడ్డి బన్సీలాల్, శ్రీనివాస్, పరుశురాములు, రామకృష్ణ, నాగభూషణం, సత్యారెడ్డి, నరసింహారెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## డిగ్రీ కళాశాల టీజీసీజీటిఏ ఎన్నికలు ఏకగ్రీవం

ముద్ర ప్రతినిధి, మెదక్:

మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల టీజీసీజీటిఏ అధ్యక్షురాలిగా వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ ఆర్. శ్రీలత, కార్యదర్శిగా వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ బి. శరత్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డాక్టర్ నాగేంద్రరావు ప్రకటించారు. కళాశాల అధ్యాపకుల సంఘ ప్రాథమిక సభ్యులు ఏ. సింహారెడ్డి, డాక్టర్ వై. ప్రవీణ్ కుమార్, డాక్టర్ టి. మల్లేశం, డాక్టర్ తిరుమల రెడ్డి, పి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. వారు ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థులను బలపరిచి, ఎన్నికల పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్ దారుణం..

**- ప్రశ్నించే గొంతుకలను అణచివేయొద్దు**

**- పద్మా దేవేందర్‌రెడ్డి**

ముద్ర, మెదక్:

ఢిల్లీలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఈ ఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగం కల్పించిందని, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను వినాలే తప్ప, బలప్రయోగంతో నిరసనలను అణచివేయకూడదని సూచించారు.

నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని పద్మా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, పార్లమెంట్‌లో విద్యార్థుల సమస్యలు, నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర చర్చ నిర్వహించాలని కోరారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళన సందర్భంగా జరిగిన ఘటనలపై స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలని, నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం అందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా పారదర్శక పరీక్షా విధానాన్ని అమలు చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని పద్మా దేవేందర్‌రెడ్డి కోరారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555